ఆదివారం
24-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 334
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు

ప్రభుత్వ లాంఛనాలతో సురవరం అంతిమ యాత్ర

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు తాము ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినవెంటనే తదనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినట్లు కూనంనేని తెలిపారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు కడసారి నివాళి అర్పించేందుకు సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక దేహాన్ని హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో గల మఖ్దూంభవన్‌లో ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉంచనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వ అధికార లాంఛనాలతో ర్యాలీగా బయలుదేరి గాంధీ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధనార్థం భౌతికదేహాన్ని అప్పగించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకటయ్యనాయుడు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, వామపక్ష నాయకులు, ఇతర ప్రముఖులు సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించడానికి ఆదివారం వస్తారని కూనంనేని పేర్కొన్నారు.

ట్రంప్‌కు మోదీ దాసోహం

- నక్సలైట్ల అంతం పేరుతో గిరిజనుల హత్య
- వ్యక్తులను హతమార్చినా సిద్ధాంతాలను చంపలేరు
- కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థలు, భూముల అప్పగింత
- రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం ▸ గవర్నర్లు కేంద్రానికి దళారులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఒంగోలులో ఘనంగా 28వ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: అంతర్జాతీయంగా దేశాల మధ్య ఘర్షణలు సృష్టించి... రెండు దేశాలకు ఆయుధాలు సరఫరా చేసి... యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ దాసోహమయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకూడదని, అలా చేస్తే సుంకాలు పెంచుతామని భారత దేశాన్ని ట్రంప్ బ్లాక్‌మెయిల్ చేస్తుంటే... ఎందుకు ప్రశ్నించడం లేదో మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలు నగరంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నగరంలోని పురవీధులలో ఎర్రసైన్యం మహా ప్రదర్శన నిర్వహించింది. అనంతరం గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. తొలుత సురవరం సుధాకరరెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ... 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా... కోట్లాది ఉద్యోగాలు ఊడగొట్టారని మండిపడ్డారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు ఖాతాల్లో వేస్తామని మోసం చేశారన్నారు. నక్సలైట్లను అంతం చేస్తామని పంతం పట్టిన మోదీ సర్కారు... గిరిజనులను దారుణంగా హత్య చేస్తున్నదని విమర్శించారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు గిరిజనులను దోచేస్తున్నదని పేర్కొన్నారు. నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని అంతం చేయలేరని స్పష్టం చేశారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవ్‌ను

- మిగతా 2 లో

తగ్గేదే లే...

2లో

భావితరాల కోసం 'మూసీ' ప్రక్షాళన

నీటి వనరుల పరిరక్షణలో తెలంగాణ రోల్ మోడల్

ఐటీపీఐ సౌత్ జోన్ సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

అమెరికాకు పోస్టల్ సేవలు బంద్

న్యూఢిల్లీ: అమెరికాకు పోస్టల్ సేవలను భారత్ నిలిపివేయనున్నది. ఈ మేరకు తపాలా శాఖ శనివారం ప్రకటించింది. అమెరికా సుంకాలకు సంబంధించిన మార్పులు ఈనెల చివరి నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపింది. ఆ దేశానికి పోస్టల్ కన్సైన్‌మెంట్‌లను సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పోస్టల్‌శాఖ వెల్లడించింది. అమెరికా సుంకాలపై స్పష్టత రాలేదని, 25వ తేదీ నుంచి ఆ దేశానికి పోస్టల్ పార్శిళ్ల తీసుకెళ్లమని విమానయాన సంస్థలు ప్రకటించాయి. వంద డాలర్ల వరకు విలువైన లేఖలు, పత్రాలు, బహుమతి వస్తువులు మినహా మిగతావాటి బుకింగ్స్

- మిగతా 2 లో

కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్

న్యూఢిల్లీ: బెట్టింగ్ కేసులో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర (50) అరెస్టు అయ్యారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయనను అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం తెలిపింది. 'ఎమ్మెల్యేను సిక్కిం రాజధాని గ్యాంగ్‌టాక్‌లోని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచాం. బెంగళూరు కోర్టులో హాజరు పరిచేందుకు ట్రాన్సిట్ రిమాండ్ పొందాం' అని వెల్లడించింది. ఈడీ బెంగళూరు జోన్ ఈ కేసును దర్యాప్తు

- మిగతా 2 లో

భారత్‌కు అమెరికా రాయబారి సెర్గియో

వాషింగ్టన్: భారత్‌కు అమెరికా రాయబారిగా శ్వేతసౌధం అధికారి సెర్గియో గోర్ నియమితులయ్యారు. సెర్గియో గోర్‌ను భారత్‌కు తదుపరి అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక రాయబారిగా నియమించడం సంతోషంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ పర్సనల్ డైరెక్టర్‌గా సెర్గియో... ప్రభుత్వంలోని ప్రతి విభాగంలో నాలుగువేల మంది 'అమెరికా ఫస్ట్' వాదులను నియమించుకున్నారని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. సెర్గియో గోర్ తన అజెండా అమలు చేయడమే కాకుండా అమెరికాను మళ్లీ గొప్పగా

- మిగతా 2 లో

అందరివాడు సురవరం

మఖ్దూంభవన్‌లో సీపీఐ నేతల ఘన నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: సిద్ధాంతాలు వేరైనప్పటికీ అన్ని రాజకీయ పార్టీల అభిమానం, అందరి ప్రేమను పొందిన గొప్ప కమ్యూనిస్టు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ నేతలు కొనియాడారు. అణగారిన వర్గాల కోసం అనేక సామాజిక ఉద్యమాలు నిర్వహించి, జీవితాంతం పేదల కోసం పరితపించిన మహనీయుడన్నారు. సురవరం ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తామన్నారు. శుక్రవారం రాత్రి కన్నుమూసిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఇ.టి.నరసింహ, సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, కలవేన శంకర్, వీఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు కమతం యాదగిరి, ముడుపు ప్రభాకర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్, కసిరెడ్డి మణికంఠ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. - కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... పునర్నిర్మాణం చేసిన సీపీఐ కార్యాలయం మఖ్దూంభవన్ ను ఇటీవల సురవరం సుధాకర్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేసుకున్నారు. ఇంతలోనే ఆయన

- మిగతా 2 లో

సురవరం అంతిమయాత్రకు ఏపీ సీపీఐ ప్రతినిధి బృందం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డికి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభ ఘనంగా నివాళి అర్పించింది. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. సభకు హాజరైన వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు ఒంగోలులోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవనంలో జరిగిన సీపీఐ కార్యదర్శి వర్గ సమావేశంలో సురవరం సుధాకరరెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు ఉన్న నేపథ్యంలో ఆదివారం హైదరాబాదులో జరిగే సురవరం సుధాకరరెడ్డి అంతిమయాత్రలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి సీపీఐ ప్రతినిధి బృందాన్ని పంపిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీ రామచంద్రయ్య రాష్ట్ర పార్టీ తరుపున అంతిమయాత్రలో పాల్గొంటారని రామకృష్ణ తెలిపారు.

మా పోరాటాల్లో మీరు సజీవం

లాల్ సలామ్ సురవరం సుధాకరరెడ్డి
సీపీఐ అరుణాంజలి

న్యూఢిల్లీ: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మృతి తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ఆయనకు అరుణాంజలి ఘటించింది. విప్లవజోహార్లు అర్పించింది. తన జీవితాన్ని వెనుకబడిన వర్గాలు, శ్రామికులు, విద్యార్థులు, యువజనుల పక్షాన పోరాటాలకు అంకితమిచ్చిన ప్రజా నాయకుడు, పోరాటయోధుడు అంటూ శనివారం ఒక ప్రకటనలో శ్లాఘించింది. తమ భావి పోరాటాల్లో సురవరం సుధాకరరెడ్డి సజీవంగా ఉంటారని పేర్కొంది. సుధాకరరెడ్డి మృతికి సంతాప సూచికంగా పార్టీ కార్యాలయాలపై అరుణ పతాకాన్ని అవనతం చేసినట్లు ప్రకటన వెల్లడించింది. కర్నూలులో స్కూలు విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే సురవరం సుధాకరరెడ్డి పోరాటాలకు నాయకత్వం వహించారని, బ్లాక్ బోర్డులు, చాక్‌పీసుల కోసం తోటి విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారని గుర్తుచేసింది. ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజి విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా అనేక పోరాటాలు చేసినట్లు వెల్లడించింది. చిన్ననాటి నుంచే ఆయనలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, తన ప్రసంగాలతో ప్రజలను ప్రభావితం చేశారని సీపీఐ కొనియాడింది.

'1960 దశకం చివరల్లో అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. హాస్టళ్లు, స్కాలర్‌షిప్పులు, సంక్షేమ పథకాల

- మిగతా 2 లో

సిరిసిల్ల నేతన్నలను ఆదుకోండి

డిప్యూటీ సీఎం భట్టికి కేటీఆర్ లేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్: సిరిసిల్ల నేతన్నలు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ. 101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు శనివారం లేఖ రాశారు. సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరలతో వీరికి చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్‌లూమ్ యూనిట్లు ఎదుర్కొంటున్న సమస్యలు... కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ-3 కేటగిరీ కిందకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ప్రజాసేవా పాడూ...పొద్దున లేచిన దగ్గర నుంచీ అందరినీ తిడితే చాలు, అధిష్టానం మెచ్చుకుంటుంది.

నాకు తెలిసిన సురవరం

ఆర్వీ రామారావ్

తేదీలు, సంవత్సరాలు సరిగ్గా గుర్తు లేదు కానీ అది 1970ల తొలి సంవత్సరాలు కావొచ్చు. హైదరాబాద్ లోని హిమాయత్ నగర్ లో అభ్యుదయ రచయితల సంఘం, యువజన సమాఖ్య కార్యాలయాలు పక్కపక్కనే ఉండేవి. ప్రసిద్ధ రచయితలతో పాటు అనేక మంది వర్ధమాన రచయితలు సాయంత్రానికి అక్కడ పోగయ్యే వారు.

అలాంటి ఒక రోజు యువజన సమాఖ్య కార్యాలయంలో కూర్చుని ఉండగా ఒక మోస్తరు పొడవు, దానికి తగ్గ లావు, లేత పసుపురంగు చొక్కా వేసుకున్న ఓ వ్యక్తి ఆ గదిలోకి వచ్చారు. ఆయన సురవరం సుధాకర రెడ్డి అని చెప్పారు. ఆయన అప్పుడే సోవియట్ యూనియన్ నుంచి తిరిగి వచ్చారట. ఆ రూపం నా మనసులో ఇప్పటికీ అలాగే ఉంది. తెలియకుండానే ఆయన మీద గౌరవభావం ఏర్పడింది. సుధాకర రెడ్డి ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఆయన ఉగ్ర రూపంలో ఉన్న సందర్భాలు ఉన్నాయి కాని ఆయన ముఖం మీద చెదరని చిరునవ్వు ఉండడమే ఎక్కువగా కనిపించేది. ఆ సమయంలోనే ఢిల్లీ నుంచి ఎన్.కె.కృష్ణన్ మొదలుకొని అనేక మంది సీపీఐ కేంద్ర నాయకులు హైదరాబాద్ వచ్చే వారు. వారు ఇంగ్లీషులో మాట్లాడేవారు. ఆ ప్రసంగాలను సుధాకర రెడ్డి తెలుగులోకి అనువదించే వారు. అదేదో అద్వితీయమైన కళ అనిపించేది.

అలాంటి ఒకానొక సమావేశంలో సుధాకర రెడ్డి అనువాదం విన్న తరవాత నేను, కాచినేని రామారావు మీ సంస్కృత అనువాదం బాగుంది అన్నాం. ఆయన నవ్వుతూ అర్థం కాలేదా అన్నారు. అర్థమైంది అని మేం చెప్పాం. ఆయన తెలుగులోకి అనువదించేటప్పుడు "అప్రతిహతమైన పోరాటం" లాంటి మాటలు వాడేవారు. ఆ మాటలను పట్టుకునే మేం సంస్కృత అనువాదం అన్నామేమో! ఉపన్యాసాలను అనువదించడంలో ఆయన దిట్ట.

ఆయన అనువాద సామర్థ్యం విచిత్రమైంది. ఇంగ్లీషులో మాట్లాడే వక్త ఏక బిగిన పది నిముషాలు మాట్లాడితే సుధాకర రెడ్డి అనువాదం సరిగ్గా పది నిముషాలూ సాగేది. ఒక సారి ఖమ్మంలో జరిగిన యువజన సమాఖ్య సమావేశానికి వెళ్లాం. ఆ సభకు కేరళ సీపీఐ నాయకుడు సి.కె.చంద్రప్పన్ రావాల్సింది. సమావేశం ముగిసే దశకు వస్తున్నా చంద్రప్పన్ జాడ లేదు. చివరకు వందన సమర్పణ చేస్తున్న దశలో తల సవరించుకుంటూ అంతగా పొడగరి కాని చంద్రప్పన్ రావడాన్ని గమనించిన వ్యక్తి వందన సమర్పణ చేస్తున్న వ్యక్తి నుంచి మైక్ లాక్కుని కామ్రేడ్ చంద్రప్పన్ జిందా బాద్ అని నినదించారు. చంద్రప్పన్ వస్తున్నారని అర్థం అయిపోయింది.

ఆయన నేరుగా వేదిక మీదకు వచ్చారు. ప్రసంగం మొదలు పెట్టారు. ఆయన పది నిముషాల చొప్పున రెండు విడతలు మాట్లాడారు. సుధాకర రెడ్డి సరిగ్గా పదేసి నిముషాల పాటు ఆ ప్రసంగాన్ని అనువదించారు.

కమ్యూనిస్టు నాయకులకు అధ్యయన అలవాటు ఎక్కువ. సుధాకర రెడ్డిలో ఆ లక్షణం కొట్టొచ్చినట్టు కనిపించేది. క్రియా శీల రాజకీయాలలోంచి తప్పుకున్న తరవాత ఆయన అధ్యయనంలోనే ఎక్కువ గడిపారు. విశాలాంధ్ర దినపత్రిక నియతంగా చదివే వారు. వారానికో పది రోజులకో నాకు ఫోన్ చేసి మంచి చెడ్డలు చెప్పే వారు. ఇక ఆ నిశిత పాఠకుడు కనిపించరు.

సుధాకర రెడ్డి, విజయలక్ష్మి 50వ పెళ్లి రోజున ఓ పాతిక ముప్పై మందిని పిలిచారు. అందులో నేనూ ఒకడిని.

నేను విశాఖపట్నంలో పని చేస్తున్న రోజులలో ఎప్పుడు ఆ ఊరొచ్చినా తప్పని సరిగా ఫోన్ చేసే వారు. ఏదో ఓ సమయంలో కలుసుకునే వాళ్లం. అలాంటి ఓ సందర్భంలో హైదరాబాద్ తిరిగొచ్చిన తరవాత విజయతో విశాఖపట్నంలో ఆర్వీ

- మిగతా 2 లో

50 రోజుల్లో సుంకాలపై ప్రకటన: ట్రంప్

వాషింగ్టన్: ఫర్నిచర్ దిగుమతులపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. 'అమెరికా లోకి వచ్చే ఫర్నిచర్‌పై మేం భారీస్థాయిలో టారిఫ్ విచారణ నిర్వహిస్తున్నాం. 50 రోజుల్లో ఆ విచారణ పూర్తవుతుంది' అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే ఎంతమేరకు సుంకం విధిస్తారనే దానిపై ఆయన వివరించలేదు. నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌కు తిరిగి ఫర్నిచర్ పరిశ్రమను తిరిగి తీసుకురావడానికి ఈ చర్యలని పేర్కొన్నారు.

కఠిన నిర్ణయం తప్పదు

రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ప్రయత్నాలపై రెండు వారాల్లో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంటానని ట్రంప్ హెచ్చరించారు. అయితే పుతిన్-జెలెన్‌స్కీతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం... నూనె, వెనిజులాను కలపడం లాంటి కష్టమైన ప్రక్రియ అని అసహనం వ్యక్తంచేశారు. యుద్ధం ముగింపు విషయంలో వారు కలిసి పనిచేస్తారా లేదా అనే విషయంపైనా స్పష్టత లేదన్నారు. భవిష్యత్తులో వారిద్దరి మధ్య జరిగే సమావేశానికి తాను హాజరవుతానో, లేదో కూడా చెప్పలేనన్నారు. ఉక్రెయిన్‌లోని అమెరికాకు చెందిన ఫ్యాక్టరీపై రష్యా దాడులు చేయడంపై స్పందిస్తూ... ఇటువంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాస్కో భారీ ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పుతిన్ తీసుకుంటున్న చర్యలతో తాను ఏమాత్రం సంతోషంగా లేనని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. యుద్ధం విషయంలో జెలెన్‌స్కీ పుతిన్‌ల వైఖరి తెలుసుకోవడానికి తనకు రెండు వారాల సమయం పడుతుందన్నారు. అప్పటికీ వారు ఓ ఒప్పందానికి రాకపోతే ఈ విషయంలో తానే నిర్ణయం తీసుకుంటానని.. అది భారీ ఆంక్షలా లేదా సుంకాలా లేకపోతే రెండూనా అనేది ప్రకటిస్తానన్నారు.

భారత్‌ను దూరం చేసుకోవడం ఆందోళనకరం

అమెరికా మాజీమంత్రి జాన్ కెర్రీ

వాషింగ్టన్: భారత్ లాంటి మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరం చేసుకోవడం ఆందోళనకరమని యూఎస్ మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ ఆందోళన వ్యక్తం చేశారు. సరైన దౌత్య ప్రయత్నాలు జరగకుండా హెచ్చరికలు జారీ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. భారత్, అమెరికా మధ్య పోరు దురదృష్టకరమని అభివర్ణించారు. ఈ క్రమంలో ఇండియా, అమెరికా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత్- అమెరికా సంబంధాలపై మేము ఆందోళన చెందుతున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ మధ్య ఈ పోరాటం దురదృష్టకరం. సాధారణ వ్యాపార విధానంలో నిజమైన దౌత్య ప్రయత్నం లేకుండా గొప్ప దేశాలు ఎల్లప్పుడూ ప్రజలకు అల్టిమేటంలు ఇవ్వడం ద్వారా గొప్పతనాన్ని ప్రదర్శించవు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పాలనలో చర్చలు పరస్పర సహకారం, గౌరవం ద్వారా జరిగాయి. కానీ ఇప్పుడు కొంచెం ఎక్కువ అర్థర్లు, ఒత్తిడితో జరుగుతున్నాయి." అని జాన్ కెర్రీ తెలిపారు.

రష్యా అణు జలాంతర్గాములు
గుర్తించడం అసాధ్యం: పుతిన్

మాస్కో: తమ వద్ద ఉన్న అణ్వాయుధ జలాంతర్గాములను విదేశీ రాడార్లు గుర్తించలేవని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఆర్కిటిక్ మంచు ఫలకాల కింద ప్రయాణించే తమ సబ్‌మెరైన్లను గుర్తించే సామర్థ్యం ఎవరికీ లేదన్నారు. సరోవ్‌లో జరిగిన కార్యక్రమంలో న్యూక్లియర్ సెక్టార్ వర్కర్లతో మాట్లాడారు. రష్యా రక్షణ అంశంలో ఆర్కిటిక్ ప్రాంతం అత్యంత కీలకమైందని పుతిన్ తెలిపారు. తమ వద్ద ఉన్న వ్యూహాత్మక న్యూక్లియర్ సబ్‌మెరైన్లు.. ఆర్కిటిక్ ఐస్ కిందకు కూడా వెళ్లగలవని, అవి రేడార్ల నుంచి తప్పించుకుంటాయని, ఇది తమ మిలిటరీ సాధించిన ఘనత అని పుతిన్ అన్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో కొనసాగుతున్న పరిశోధనలు కీలకమైనవన్నారు. అయితే ఆర్కిటిక్‌లో మంచు కరుగుతున్న కారణంగా షిప్పింగ్ రూట్లు ఇప్పుడు మరింత ఎక్కువ యాక్సిస్‌లోకి వచ్చినట్లు ఆయన చెప్పారు. చాలా వరకు దేశాలు ఇప్పుడు ఆర్కిటిక్ దారిని ఉపయోగించాలని చూస్తున్నాయని, అలాంటి సమయంలో తమకు అనుకూలత పెరుగుతుందన్నారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన ఐస్‌బ్రేకర్ సబ్‌మెరైన్లు రష్యా వద్దే ఉన్నాయని...

అమెరికాకు పోస్టల్ సేవలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ తెలిపింది. ఇప్పటికే పార్సిళ్లను బుక్ చేసుకున్న, పంపని కస్టమర్లు డబ్బు వాపసు తీసుకోవచ్చని పేర్కొంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్లు వెల్లడించింది. వీలైనంత త్వరగా సేవలను తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తపాలా శాఖ అధికారికంగా ప్రకటించింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోంది. ఎమ్మెల్యే తన సహచరులతో కలిసి కసినోను లీజుకు తీసుకోవడానికి గ్యాంగ్‌టక్‌కు వెళ్లడని తెలిపింది. వీరేంద్ర సోదరుడు నాగరాజ్, అతని కుమారుడు పృథ్వీ ఎన్ రాజ్ ప్రాంగణాల నుంచి అనేక ఆస్తి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. 'మరో సోదరుడు తిప్పేస్వామి వంటి అతని ఇతర సహచరులు దుబాయ్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు' అని ఈడీ వెల్లడించింది.

అందరివాడు సురవరం

(మొదటిపేజీ తరువాయి)

ఫోటోకు పూల మాల వేసే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి అన్ని వర్గాలకూ, ప్రాంతాలకూ, రాజకీయ పార్టీలకూ అత్యంత ఇష్టమైన నాయకుడని, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు అత్యంత ఇష్టమైన కొద్ది మంది నేతల్లో సురవరం ఒకరని కొనియాడారు. సురవరం సౌమ్యుడని, సున్నిత మనస్తత్వం కలిగిన వ్యక్తి అన్నారు. ఆయన ముఖంలో తాము ఎప్పుడూ కోపాన్ని చూడలేదనే విషయాన్ని చాలా మంది పెద్దలు తనతో చెప్పారన్నారు. అన్ని వర్గాల అభిమానం, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ ఎస్‌తో పాటు బీజేపీ నాయకులు సైతం సురవరం పట్ల అత్యంత ప్రేమను వ్యక్తం చేశారన్నారు. సురవరం లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను తాము కొనసాగిస్తామన్నారు.

- చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ... యువజన, విద్యార్థి ఉద్యమాల మొదలుకొని ఉమ్మడి మహబూబ్ జిల్లా నుంచి సీపీఐ జాతీయ నేతగా సురవరం ఎదిగారన్నారు. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండే వ్యక్తి సురవరం అన్నారు. ఆయనది నిక్కచ్చిగా చెప్పే మనస్తత్వమని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సురవరం ప్రధాన పాత్ర పోషించారని, ఎంతో అంకితభావంతో పనిచేశారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమాలు బలపడాలని, వామపక్ష ఐక్యత కోసం ఎంతగానో కృషి చేసిన వ్యక్తి అన్నారు. వామపక్షాలు ఒక వేదికపైకి వస్తే దేశంలోనే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని, వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ 2015లోనే రాజకీయ తీర్మానం చేశారని చాడ గుర్తు చేశారు. సీపీఐని బలోపేతం చేయడమే సురవరం సుధాకర్‌రెడ్డికి ఇచ్చే నివాళి అన్నారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పేద వర్గాల హక్కుల కోసం దేశంలో వామపక్ష ఉద్యమాలతో పాటు కార్మిక, రైతు, అణగారిన వర్గాల, సామాజిక ఉద్యమాలను నిర్వహించిన మేధావి సురవరం అని కొనియాడారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్ పూర్తిచేయాలని పాదయాత్ర నిర్వహించారని, పార్లమెంట్‌లో కార్మిక, రైతాంగ చట్టాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన తన జీవితాంతం అణగారిన వర్గాల పక్షాన నిలబడిన యోధుడన్నారు.

భారత్‌కు అమెరికా రాయబారి సెర్గియో

(మొదటిపేజీ తరువాయి)

నిలపగలరన్న నమ్మకం ఉందన్నారు. సెర్గియో గోర్ అద్భుత రాయబారిగా నిలుస్తారని ఆకాంక్షిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ అధ్యక్ష పదవిని చేపట్టినప్పటి నుంచి భారత్‌కు రాయబారి స్థానం ఖాళీగా ఉంది. భారత్‌లో అమెరికా మాజీ రాయబారి ఎరిక్ గార్సెట్టి, లాస్ ఏంజెల్స్ మాజీ మేయర్. 'రాయబారిగా సెర్గియో గోర్‌ను ప్రతిపాదించినందుకు అధ్యక్షుడి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా' అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు.

నాకు తెలిసిన సురవరం

(మొదటిపేజీ తరువాయి)

రామారావును కలిశాను అని చెప్పారట. ఆమె వెంటనే వాళ్ల ఇంటికెళ్లావా, శారదను (మా ఆవిడ), పిల్లలను పలకరించావా అని అడిగారట. లేదు అంటే మరి నువ్వు విశాఖపట్నం ఎందుకు వెళ్లినట్టు అని ఆమె నిలదీశారు.

ఆయన ఎంపీ అయిన తరవాత తరచుగా కలుసుకోవడం తగ్గింది. ఒకటి రెండు సార్లు ఒక్క సారి అర్వింరామారావ్ నా ఫోన్ చెయ్యమని చెప్పండి అని కబురు పెట్టారు. నేను చేసే వాడిని. కానీ ఆయన భద్రత కోసం వచ్చిన పోలీసులు ఫోన్ ఎత్తి ఆయన ఫలానా పనిలో ఉన్నారు, మరో పనిలో ఉన్నారు అని చెప్పేవారు. అదే సమయంలో ఒక సారి మఖ్యాలా భవన్లో కనిపించారు. "ఏం దొరా! ఎన్నాళ్ళయింది మాట్లాడి" అన్నారు. తరచుగా నన్ను దొర అనే సంబోధించేవారు. మీ ఫోన్ ఎప్పుడూ మీ దగ్గర ఉండదు. మీ భద్రతా సిబ్బంది మాట్లాడతారు. నేను నా పేరు, ఇతర వివరాలు చెప్పినా అవి మీదాకా చేరుతున్నట్టు లేదు. అయినా మీరు ఈ మధ్య మనుషుల్లో ఉంటేగా అని సహజ ధోరణిలో దెప్పిపొడిచే వాడిని. చిరునవ్వే ఆయన సమాధానం.

మరో సారి నేను వనస్థలిపురంలో ఇల్లు కట్టిన్న సమయంలో ఆట వేపు వచ్చారు. అప్పటికి ఇల్లు పూర్తి కాలేదు. ఏదీ మీ ఇల్లు చూద్దాం పదండి అన్నారు. అప్పటికే చీకటి పడింది. అయినా మెట్లు పైకి ఎక్కి చూపించి వచ్చాను. చూడకపోతే విజయ కోపగిస్తుంది అన్నారు. ఆయనతో, ఆయన భార్యతో ఎన్నాళ్లకొకసారి కలుస్తున్నా అన్యోన్యతను కలిగినప్పుడు మాత్రం ఆప్యాయంగా ఉండే వాళ్లం.

శుక్రవారం రాత్రి ఆయన మరణ వార్త తెల్సింది. నేను వార్త రాసే పని మొదలెట్టాం అనుకుంటే విజయ ఫోన్ చేసి తెలిసిందిగా అన్నారు. తెలిసిన వాళ్లను, సన్నిహితులను ఆప్యాయంగా పలకరించడం వారిద్దరికీ సోకిన అంటువ్యాధి కాబోలు.

ఆయన మొదటి సారి లోకసభ సభ్యుడైనప్పుడు ఎన్నికైన వారి చేత ప్రమాణం చేయించే బాధ్యత ఇంద్రజిత్ గుప్తా మీద పడింది. పార్లమెంటు సభ్యుల్లో అప్పటికి ఆయనే సీనియర్. అందువల్ల ప్రొటెం స్పీకర్ గా ఉన్నారు. సుధాకర్ రెడ్డి ప్రమాణం చేసి వెళ్తోతుంటే ఇంద్రజిత్ గుప్తా ఆయనను వెనక్కు పిలిచి "ఎన్నికైతే సరిపోదు. మంచి పార్లమెంటేరియన్‌గా నిరూపించుకో" అన్నారు. సుధాకర రెడ్డి ఆ మాటను సుగ్రీవాజ్ఞలా భావించారు.

2022 అక్టోబర్‌లో విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ 24వవ మహాసభ జరిగింది. ఆయనను విశాలాంధ్ర ఆఫీసుకు తీసుకొచ్చి సుదీర్ఘమైన ఇంటర్వ్యూ చేశాను. అంతకు ముందు కూడా ఒకసారి ఇంటర్వ్యూ చేసినట్టు గుర్తు. సందర్భం ఏమిటో గుర్తుకు రావడం లేదు. ప్రసంగించినా, ముఖాముఖి మాట్లాడినా నిదానిగా, స్వరం పెంచకుండా మాట్లాడడం సుధాకర రెడ్డి అలవాటు.

రాష్ట్ర విభజనకు ముందు ఓ సారి ఇద్దరం సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అప్పుడు సీపీఐ రాష్ట్ర విభజనకు అనుకూలం. నేను వ్యతిరేకం. చాలా సేపు మాట్లాడుకున్న తరవాత మీ అభిప్రాయం ఏమైనా కావొచ్చు ఇది పార్టీ వైఖరి అన్నారు. అయినా నేను విభజనను ఎప్పుడూ సమర్థించలేదు. 1992 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సీపీఐ 15వ జాతీయ మహాసభ జరిగింది. నేను ఇంద్రజిత్ గుప్తాను ఇంటర్వ్యూ చేయాలనుకున్నాను. ఆయన ససేమిరా అంగీకరించలేదు. చివరకు సుధాకర రెడ్డి సహాయం తీసుకుని ఇంటర్వ్యూ సంపాదించాను. అయితే ఆ ఇంటర్ వ్యూ నేను ప్రచురించలేదు. అది వేరే కథ.

సుధాకర రెడ్డి మొదటిసారి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనప్పుడు ఫోన్ చేసి అభినందించాను. అందులో విశేషం ఏమీ లేదు. కానీ అభినందించడంతో ఆగలేదు. "సుధాకర రెడ్డి గారూ ఒక్క మాట చెప్తా వినండి అన్నాను. ఆయన చెప్పండి అన్నారు. మేం 1970ల ఆరంభంలో వామపక్ష రాజకీయాల వేపు వచ్చినప్పుడు మా జీవిత కాలంలో సోషలిజం వస్తుందనే ఆశ ఉండేది. కానీ అది పూర్తి భ్రమ అని తేలిపోయింది. మా తరవాతి తరం, ఆ తరవాతి తరంలో కూడా సోషలిజం వస్తుందన్న ఆశలేదు. కానీ ఆ దీపం వెలిగేట్టు చూడండి" అన్నాను. రెండు నిముషాల సేపు మౌనం. ఆ తరవాత తప్పకుండా ప్రయత్నిస్తా రామారావు గారూ అన్నారు.

నిరుపేద కుటుంబంలో పుట్టారు లాంటి రొడ్డ కొట్టుడు పరిచయాలు ఆయనకు వర్తించవు. కానీ ఆయన మాత్రం కరిగిపోయారు. ఆయన పార్టీ కార్యకర్తలకు ఇచ్చే సలహాలు విశిష్టంగా ఉండేవి. "హోటళ్లలో చట్నీ ఎక్కువగా ఇచ్చేటట్టయితే అదే ఎక్కువగా తినండి" అనే వారు. కార్యకర్తల ఖాళీ కడుపులను అంచనా వేసే సమర్థుడాయన. విధిగా రోజూ విశాలాంధ్ర చదివి తన అభిప్రాయం చెప్పే ఒక్క మిత్రుడు తగ్గారు. నా మటుకు నాకు అదే పెద్ద లోటు.

ట్రంప్‌కు మోదీ దాసోహం

(మొదటిపేజీ తరువాయి)

చంపిన రోజే అదానీకి 22 వేల ఎకరాల భూమి అప్పగించారని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలు తన నియంత్ర పాలనకు అడ్డువస్తున్నాయన్న కారణంతో వాటిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి పదవి గిరిజన మహిళకు ఇచ్చామని ప్రగల్భాలు పలుకుతూ ఆమె సంతకంతో గిరిజన వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. గవర్నర్లు కేంద్రానికి దళారులుగా తయారయ్యారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని నారాయణ చెప్పారు. ఎన్నో మంచి తీర్పులు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా ఐక్యసంఘటన నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే.. ఆయన మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని బీజేపీ దుర్మార్గంగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. 30 రోజులు జైలులో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు సైతం పదవులలో ఉండరాదంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొత్త చట్టం తీసుకొస్తున్నారని విమర్శించారు. ఈ చట్టం ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై తప్పుడు కేసులు బనాయించడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. ఇలాంటి చట్టం వస్తే ప్రథమంగా తన కేసు నుండి బయటపడేందుకు 12 మంది లాయర్లు, సాక్షులను చంపించిన అమిత్ షాపై ప్రయోగించాలన్నారు. జీఎస్టీ ద్వారా రూ.22 లక్షల కోట్ల పన్నుల వసూలు చేశామని ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారని, కార్పొరేట్ కంపెనీలకు 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి... సామాన్యులపై ఐదు శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ పెంచడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామాన్యుడు వాడే చెప్పులపై జీఎస్టీ పెంచిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఎలాగైనా బీహార్ ఎన్నికలలో గెలవడానికి దొంగ ఓట్లు చేర్పించుకోవడమే కాకుండా విపక్ష అనుకూల ఓట్లను లక్షల్లో తొలగించారని నారాయణ విమర్శించారు. ఇలాంటి దుర్మార్గ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ రెండు కాళ్లుగా నిలబడటం సిగ్గుచేటన్నారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు... నేడు అవే మీటర్లు అమర్చేందుకు అత్యుత్సాహం చూపించడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆత్మగౌరవం నినాదంతో ఆవిర్భవించిన టీడీపీని చంద్రబాబు బీజేపీకి తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ఏడాదికి మూడు పంటలు పండుతూ... పచ్చగా ఉన్న పొలాలలో ఆరు వేల ఎకరాలు పోర్టుకు అప్పగించాలని చూడటం సమంజసం కాదన్నారు. చంద్రబాబుకు 100 ఎకరాలు అవసరం ఉంటే 1000 ఎకరాలు కావాలని ఉబలాటపడుతాడన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోజుకో మాట... పూటకో వేషం వేస్తూ సనాతన ధర్మాన్ని నెత్తికెత్తుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బలవంతంగా రైతుల భూములు లాక్కొని బడాబాబులకు అప్పగించాలని చూస్తే మరో పోరాటంతో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీని గ్రామీణస్థాయి నుండి బలోపేతం చేయాలని, చివరిస్థాయి వరకు ప్రజా పక్షాన పోరాడిన సురవరం సుధాకర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తలు పోరాట పటిమను పెంచుకోవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రలో పేదల కోసం అనేక త్యాగాలు చేసిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశంలో పాల్గొన్న పార్టీల చరిత్రను చెరిపేసి, ఒకటి మహోన్నతంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కాగా... మరొకటి ఎర్రజెండా పార్టీ సీపీఐ అన్నారు. సీపీఐతో పాటు ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ మాత్రం స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదన్నారు. బ్రిటిష్ వారి అడుగులకు మడుగులొత్తుతూ... తొత్తులుగా వ్యవహరించినట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని పార్టీ, నాయకులు కేంద్రంలో అధికారం చెలాయిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌ను కీర్తించడం సిగ్గుచేటన్నారు. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి స్వతంత్రయోధులను విస్మరించడం తగదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో దొంగ ఓట్ల ద్వారానే బీజేపీ విజయం సాధించిందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి

అమ్ముడుపోయిందన్నారు. దీనిపై సాక్ష్యాలతో దొంగ ఓట్లను బయటపెట్టిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి నోటీసులు ఇస్తూ... బెదిరించాలని చూస్తుందన్నారు. దొంగ ఓట్లపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా కేంద్ర ఎన్నికల సంఘానికి గానీ, కేంద్ర ప్రభుత్వానికి గానీ పట్టడం లేదన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రధాని మోదీ అంటూ చంద్రబాబు కితాబివ్వడాన్ని రామకృష్ణ తప్పుబట్టారు. మరోవైపు పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ ఆర్ఎస్ఎస్ అజెండాను నెత్తికెత్తుకున్నారని మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కారు అని పదేపదే చెప్పుకుంటున్న చంద్రబాబు 22 సార్లు ఢిల్లీ వెళ్లి ఏమి సాధించారని నిలదీశారు. ఏడాది కాలంలో చంద్రబాబు రాష్ట్రానికి సాధించిన అభివృద్ధి రూ. 1.75 లక్షల కోట్ల అప్పు అని ఎద్దేవా చేశారు. రాజధాని నిర్మాణం పేరుతో రూ.32 వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. మరో రూ.32 వేల కోట్ల అప్పు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి నారాయణ చెబుతున్నారన్నారు. చంద్రబాబు మాత్రం అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ.78 వేల కోట్లు అప్పు చేస్తున్నట్లు చెప్తున్నారన్నారు. మంత్రి, ముఖ్యమంత్రి వ్యాఖ్యలలో ఏది వాస్తవమో తెలపాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై చంద్రబాబు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబును తెలుగుజాతి క్షమించదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో డబుల్ ఇంజన్ స్పీడ్‌తో ప్రభుత్వంపై ఇళ్ల స్థలాల కోసం పోరాటానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే జల్లి విల్సన్, పి.హరినాథ్ రెడ్డి, జి.ఓబులేసు, పి.రామచంద్రయ్య, జగదీశ్, కేవీవీ ప్రసాద్, జంగాల అజయ్ కుమార్, డేగ ప్రభాకర్, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీజే చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తగ్గేదే లే...

విశాలాంధ్ర - హైదరాబాద్: సాధారణంగా ఏదైనా మంచి పని చేసేటప్పుడు కొందరు కావాలనే అడ్డుపడుతుంటారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మూసీ విషయంలోనూ ఇదే జరుగుతోందని, భావితరాల కోసం ప్రక్షాళన చేసి తీరుతామని, వెనక్కి తగ్గేది లేదని, నీటి వనరుల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను రోల్ మోడల్‌గా నిలుపుతాం మంత్రి స్పష్టం చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటీపీఐ), తెలంగాణ స్టేట్ రీజినల్ ఛాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌హోటల్ లో 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టువార్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సౌత్ జోన్ సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... నగరాల అభివృద్ధికి సరైన ప్రణాళికే పునాది అని అన్నారు. పర్యావరణం, సుస్థిరత లేకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణతో కూడిన వృద్ధి ఆవశ్యకమన్నారు. ఆర్థిక భవిష్యత్తుకు పట్టణ ప్రణాళికే పునాది అని నొక్కి చెప్పారు. మనం రూపొందించే ప్రతి విధానం, కాపాడే ప్రతి అడవి, పునరుద్ధరించే ప్రతి నది, సృష్టించే ప్రతి జీవనోపాధి - ఇవన్నీ తరాల మధ్య న్యాయానికి సంకేతాలని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, కార్బన్ - న్యూట్రల్ గ్రోత్, జల సంరక్షణ, సుస్థిర రవాణాలో తెలంగాణ అవలంభిస్తున్న విధానాలు, తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే సుస్థిరాభివృద్ధితో కూడిన నగరాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. వాతావరణ మార్పులు, పట్టణ వరదలు, పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల తరుగుదల, పట్టణీకరణ, తరిగిపోతున్న పచ్చదనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నగర ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఐటీపీఐ ప్రెసిడెంట్ ఎన్ కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కో-ఆర్డినేటర్(టెక్నో అడ్మిన్) ప్రదీప్ కుమార్, ఐటీపీఐ- తెలంగాణ రీజినల్ ఛాప్టర్ చైర్మన్ ఎస్.దేవేందర్ రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

మా పోరాటాల్లో మీరు సజీవం

(మొదటిపేజీ తరువాయి)

కోసం 62 రోజుల దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. విద్యార్థుల పక్షాన పోరాటాలతో అనేకసార్లు నిర్బంధానికి గురయ్యారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్యక్షుడిగా యువతకు 18 ఏళ్లకు ఓటు హక్కు కోసం పోరాడి సాధించారు. నల్లగొండ నుంచి రెండుసార్లు (1998, 2004) లోక్‌సభకు ఎన్నికయ్యారు. కార్మిక శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్‌గా వ్యవహరించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, ప్రైవేటు స్కూలు టీచర్లకు గ్రాట్యుటీ హక్కుల కోసం ఉండి సిఫార్సుల్లో సంబంధిత చట్టాలకు ఆధారమయ్యాయి. నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య, వ్యవసాయ సంక్షోభం, నల్లధనం, 2జీ కుంభకోణం వంటి సమస్యలపై పార్లమెంటులో గళం వినిపించారు. సమగ్రత, సామాజిక న్యాయం కోసం ప్రజల గొంతుకయ్యారు. పార్టీలకు అతీతంగా అందరి ఆదరణ పొందారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల వ్యతిరేకాందోళన సహా అనేక ప్రజా పోరాటాలకు సారథ్యం వహించారు. పోలీసు బుల్లెట్ల నుంచి తృటిలో తప్పించుకున్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలు ప్రతిఘటనకు ఈ ఉద్యమం ఊపిరిపోసింది. సురవరం సుధాకర్‌రెడ్డి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా 1997 నుంచి 2005 వరకు పనిచేశారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీగా 2008లో వ్యవహరించారు. లెఫ్ట్ వైపునకు యువతను ఆకర్షించడంలో గణనీయమైన తోడ్పాటు అందించారు. ముఖ్యంగా యూనివర్సిటీ విద్యార్థులను చైతన్యపరిచారు. సీపీఐ ప్రధాన కార్యదర్శిగా 2012 నుంచి 2019 వరకు బాధ్యతలు చేపట్టారు. సంస్థాగతంగా పార్టీలో నూతనోత్సాహం నింపారు. కేడర్‌లో అవగాహన పెంచడం, ప్రజా ఉద్యమాల నిర్మాణం, మతతత్వవాద-నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వామపక్షాల ఐక్యత కోసం కృషి చేశారు. సుధాకర్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ సభ్యత్వం పెరిగింది. యువజన, మహిళా శాఖలకు ఆదరణ లభించింది. అంతర్జాతీయ స్థాయిలోనూ సీపీఐకి ప్రాతినిధ్యం లభించింది. 40కుపైగా అంతర్జాతీయ సదస్సుల్లో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సోవియట్ రష్యాలో, మంగోలియాలో విద్యార్థి సభలకు వెళ్లారు. అమెరికా, ఇటలీ, వియత్నాం, జపాన్ తదితర దేశాల్లో సౌహార్ద సందేశాలిచ్చారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలోనూ మాట్లాడారు. శ్రామిక ప్రజల కోసం భారతదేశ విజన్‌ను ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన నాయకత్వంలో పార్టీకి అంతర్జాతీయ సంఘీభావం పెరిగింది. దేశంలోనూ అపకీర్తిలు మెరుగుపడ్డాయి. సురవరం సుధాకర్‌రెడ్డి తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరు. ఆయన మంచి వక్త. వ్యాసాలు రాయడంలో దిట్ట. కరపత్రాలు, పుస్తకాలు రాశారు. మార్క్సిజం అంటే కొత్తతరానికి అర్థమయ్యేలా ఆయన మాటలు, రచనలు ఉంటాయి. సుధాకర్‌రెడ్డి ప్రసంగాలు, రచనలు దేశవ్యాప్తంగా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చేవిగా ఉంటాయి. తరగతి గది నుంచి అంతర్జాతీయ స్థాయి కామ్రేడ్‌షిప్ (సాంగత్యం) వరకు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రస్థానం సాగింది. ప్రజా పోరాటాలకు అంకితమై... సైద్ధాంతిక నాయకత్వానికి సజీవసాక్ష్యిగా ఆయన జీవితం నిలిచింది. అత్యద్భుత వామపక్ష నాయకుడిగా సురవరం సుధాకర్‌రెడ్డి చిరస్మరణీయులు' అని సీపీఐ పేర్కొంది.

ఇబిలావుంటే సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారని పార్టీ ప్రకటించింది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయనకు పుష్పాంజలి ఘటిస్తారని తెలిపింది. రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి! లాల్ సలామ్! అని నినాదమిచ్చింది.

సిరిసిల్ల నేతన్నలను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ. 35.48 కోట్లు బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని వివరించారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు. నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

'ఎర్ర'సూరీడు 'సురవరం'

ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశ రాజకీయాల్లో తన దైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని, ప్రజా క్షేత్రంలో ఆయన సేవలు మరువలేనివని, జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి నేతగా ఎదిగిన వామపక్ష ఉద్యమనేతని, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన పేదలపక్షపాతి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్ రావు, వై.ఎస్.జగన్, ఉప ముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్ కళ్యాణ్, తెలంగాణ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఏపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి... సురవరం భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డి.కె.అరుణ, ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తమ సంతాపం వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... సీఎస్ రామకృష్ణ రావును ఆదేశించారు.

దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర: రేవంత్ రెడ్డి

సీపీఐ అగ్ర నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. రెండుసార్లు నల్లగొండ ఎంపీగా ఎన్నికైన సురవరం గొప్ప నాయకుడని కొనియాడారు. దేశ రాజకీయాల్లో తన దైన ముద్ర వేసిన మహోన్నత నేతను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర

అర్హత ఉన్న దరఖాస్తులను గుర్తించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హత ఉన్న దరఖాస్తులను గుర్తించి వారం రోజుల్లో సమర్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై శనివారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పథకం కింద దారిద్ర్య రేఖ దిగువనున్న ప్రాథమిక ఆదాయం కలిగిన 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయసున్న కుటుంబ పెద్ద పురుష లేదా మహిళ సహజ లేదా ప్రమాదవశాత్తు మరణించిన సమయంలో ఒకేసారి 20వేల రూపాయల నగదు సహాయాన్ని కుటుంబానికి అందించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబంలో ప్రాథమిక సంపాదనదారుడు మరణించిన రెండు సంవత్సరాలు లోపు ఈ సహాయానికి వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంత్యోదయ అన్నా భీమా యోజన, జనశ్రీ బీమా యోజన కింద లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని స్పష్టం చేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న సూర్యాపేట కలెక్టర్

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మానవత్వం, సాధారణతతో ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. శనివారం మహాత్మా జ్యోతి బాపూలే బి.సి. వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో మమేకమయ్యారు. కలెక్టర్‌తో భోజనం చేయడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపగా, ఓ పెద్ద అధికారి వారితో కలిసిపోవడం వారికి మరిచిపోలేని అనుభూతి కలిగించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారి కెరీర్ భవిష్యత్తు ప్రణాళిక గురించి మార్గదర్శనం చేశారు. ఏ విధంగా కష్టపడి చదవాలి, ఏ రంగంలో అవకాశాలు మెరుగ్గా ఉంటాయి, జీవితంలో లక్ష్యం ఎలా ఉండాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. వర్షం కురుస్తుండగా స్కూల్ పిల్లలు ఇబ్బందిగా వెళ్తున్నారని గమనించిన ఆయన వారిని తన కారులో ఎక్కించుకొని స్కూల్‌కి చేర్చారు. కలెక్టర్‌గా ఉన్నా, ఒక తండ్రిలా విద్యార్థులను కాపాడటం, ఒక గురువులా వారికి బోధించడం, ఒక స్నేహితుడిలా ప్రజలతో కలిసిపోవడం ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. సూర్యాపేట జిల్లాలో "ప్రజలకు చేరువైన కలెక్టర్"గా తేజస్ నంద్ లాల్ పవార్ పేరు గుండెల్లో ముద్రించుకుంది.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తుంటే లేదా విక్రయిస్తుంటే 14446 లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి తెలిపారు. దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శనివారం సంగారెడ్డిలోని తార డిగ్రీ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వ మిషన్ పరివర్తన' కార్యక్రమం జరుగుతోంది. పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని మత్తు పదార్థాలు వినియోగించడం, విక్రయించడం చట్టపరమైన నేరం మని కఠిన కారాగార శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. తదనంతరం అధికారులు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, క్రైమ్ బ్రాంచ్ అధికారి రమేష్, తార డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, జిల్లా ఆరోగ్య, విద్య విస్తరణ అధికారి శ్రీనివాస్ రావు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ధనంజయ నాయుడు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరిగిన సిపిఐ నాలుగవ రాష్ట్ర మహాసభల్లో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. హుజూర్నగర్‌కు చెందిన ధనుంజయ నాయుడు 1980 సంవత్సరంలో సిపిఐ అనుబంధ ఏఐఎస్ఎఫ్‌లో 25 పైసల సభ్యత్వంతో విద్యార్థి సంఘం లో చేరారు. ఆ తరువాత కాలములో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాలలో పనిచేస్తూ నాట్యాచార్యుడిగా, ఈ ప్రాంతంలోని అనేక మందికి నాట్యాభ్యాసం లో శిక్షణ ఇస్తూ ప్రజానాట్యమండలి హుజూర్నగర్ పట్టణ కార్యదర్శిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుమారు 15 సంవత్సరాలు పనిచేశారన్నారు. ఈనెల 20 నుంచి 22 వరకు జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిపిఐ పార్టీ కి మళ్లీ పూర్వ వైభవం వస్తుందన్నారు. తనకు రాష్ట్ర కమిటీలో స్థానం లభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూనా ఎన్నిక సహకరించిన సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి కి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్‌కు సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

స్వశక్తి కార్మికులకు అన్నివిధాలా సహకరిస్తాం

విశాలాంధ్ర- చర్ల : స్వశక్తితో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని జీవనోపాధి పొందుతున్న గిరిజన మహిళలకు ఐటీడీఏ, ఐటీసీ ద్వారా చేయూత అందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ అన్నారు. వారి పరిశ్రమలను అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. శనివారం మండలంలోని ఆర్ కొత్తగూడెం పంచాయతి పరిధిలో వున్న సున్నం గుంపు గ్రామంలోని ముత్యాలమ్మ జాయింట్ లియబిలిటి గిరిజన మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల తినుబండారాలను ఆయన పరిశీలించారు. అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులను సేకరించి నిత్యవసరాలకు వాడుకొనడమే కాక సహజంగా దొరికే ఇప్పపువ్వుతో మంచి ఆరోగ్యాన్నిచ్చే ఆహార పదార్థాలు తయారు చేసి వాటిని అమ్మకాలు జరుపుకొని జీవనోపాధి పొందడం సంతోషకరమన్నారు. ఇప్పపువ్వుతో మంచి సహజ గుణాలు కలిగిన డ్రై ఫ్రూట్స్ మిక్స్ చేసి లడ్డులు, బర్ఫీ, చాక్లెట్లు, ఔషధ గుణాలు కలిగిన వనమూలికలతో వివిధ రకాల కారంపొడి పచ్చళ్ళు తయారుచేసి అమ్మకాలు జరుపు కుంటున్నారని రాహుల్ కొనియాడారు. ఇక్కడి మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వశక్తితో జీవనోపాధి పొందడం అభినందనీయమన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటిసి మేనేజర్ చంగల్‌రావు, ప్యాకింగ్, డిజైనింగ్ కోఆర్డినేటర్ బేగ్, మహిళా సభ్యులు సమ్మక్క, మునెమ్మ, శ్రీదేవి, రమాదేవి, శిరీష, ఈశ్వరి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పనుల జాతరతో రాష్ట్రం అంతటా పండుగ వాతావరణం

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్/ ములుగు జిల్లా బ్యూరో: పనుల జాతరతో ఊరురా బతుకమ్మ పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గాల వ్యాప్తంగా ఉత్సాహంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతున్నాయి. రెండో రోజు పనుల జాతరలో భాగంగా ములుగు జిల్లా మల్లంపల్లి శ్రీనగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క శనివారం శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత జె.డి. మల్లెంపల్లి మండలంలోని ఎం.డి. గౌస్ పల్లెలో నిర్మాణం పూర్తి చేసుకున్న కల్వర్ట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, సుస్థిరత లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ఆద్వర్యంలో శుక్రవారం పనుల పండగా మొదలైంది. ఉపాధి అవకాశాలను పెంచుతూ, మౌలిక సదుపాయాలను విస్తరించే దిశగా పనుల జాతర ముందుకు సాగుతోంది. మొదటి రోజు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.205 కోట్లతో మొత్తం 13,552 పనులు ప్రారంభించబడగా, రూ.1994 కోట్ల నిధులతో 88,037 అభివృద్ధి పనులకు అనుమతి పత్రాలు జారీ అయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలో 1,01,589 పనులు రూ.2199 కోట్ల నిధులతో ప్రారంభమ వడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. పనుల జాతరను మంచి సమన్వయంతో సక్సెస్ సాధించిన పంచాయతీరాజ్ కమిషనర్ నుండి పంచాయతీ కార్యదర్శి, కారోబార్ వరకు అందరికీ మంత్రి సీతక్క హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి ప్రతి కుటుంబానికి వేతనంతో కూడిన పనిని కల్పించడం ద్వారా మౌలిక వసతుల కల్పన, ఉత్పాదకత పెంపు, సుస్థిరమైన ఆస్తుల సృష్టి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు ప్రజా విజయోత్సవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

విద్యార్థుల మేధస్సును వెలికి తీయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: విద్యార్థుల మేధస్సును వెలికితీయడానికి ఉపాధ్యాలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ శనివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఫార్మసీ కాలేజ్ అనంతరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహబూబాబాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, కేసముద్రం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల జూనియర్ కాలేజ్, జిల్లా పరిషత్ హైస్కూల్ కల్వలను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల మేధస్సును వెలికితీయడానికి నూతన టెక్నాలజీ ఉపయోగించి, సబ్జెక్టుల వారీగా విద్యా బోధనలు అందించుటకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు.

ప్రజల విశ్వాసం చూరగొనేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా వైద్యులు స్థానికంగా ఉంటూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల ప్రజల విశ్వాసాన్ని పెంచాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్యులను ఆదేశించారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధ నిల్వలు, వార్డుల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్యులు సమయపాలనతో మెరుగైన వైద్య సేవలు అందించాలి అని సూచించారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని, ముఖ్యంగా మహిళలు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే వైద్య అధికారులను సంప్రదించాలని, వారు పరిష్కారం చూపుతారని భరోసా ఇచ్చారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కారేపల్లి : వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని నాకు చందాలు దందాలు చేయడం లాంటి పనులు తెలియదని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండల పరిధిలోని గాదెపాడు గ్రామంలో 20 లక్షల రూపాయల ఎస్డిఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కత్తిరించి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని ఆరోపించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డిఎల్ పిఓ రాంబాబు, మండల ప్రత్యేక అధికారి చందన్ కుమార్ డీఎస్ఓ పవన్ కుమార్ ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ సురేష్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్ ఐకెపి ఏపిఎం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, బానోతు రామమూర్తి, బానోతు దేవులా నాయక్, న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమఫీల్డ్ ఆఫీసర్‌గా అవార్డు తీసుకున్న అశోక్‌కు సన్మానం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా: ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న రత్నాకర్ రావు బాధ్యతల చార్జ్ తీసుకున్న తదుపరి ఉపాధి హామీ పథకం రాజుర గ్రామంలో ఫీల్డ్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న, అశోక్ ఆగస్టు 15న కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఫీల్డ్ ఆఫీసర్గా అవార్డు తీసుకున్న సందర్భంగా వేల్పుల అశోక్‌ను ఎంపీడీవో కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టుపార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శివర్గసభ్యునిగా జిల్లాకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. మూడు రోజులపాటు మేడ్చేల్ జిల్లా గాజుల రామవరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. నేలకొండపల్లి మండలం మూటాపురంలో రైతు కుటుంబంలో జన్మించిన బాగం హేమంతరావు విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. ఎ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి, ఎ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన ఆయన సుదీర్ఘకాలం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా విభజన అనంతరం అవశేష ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, డి.సి.సి.బి. ఉపాధ్యక్షులుగా పనిచేశారు. మూటాపురం పి.ఎ.సి.ఎస్. అధ్యక్షునిగా పనిచేస్తున్న బాగం హేమంతరావు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, సి.పి.ఐజాతీయ సభ్యునిగా కొనసాగుతూ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యునిగా ఎన్నికయ్యారు. ఖమ్మం రూరల్‌మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా అత్యంత కీలకమైన సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మన్గా ఎన్నికయ్యారు. సీనియర్ కమ్యూనిస్టుగా జిల్లాకు పరిచితులైన మౌలానా ఛైర్మెన్ ఎన్నిక కావడం ఇది రెండోసారి. సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సమితి సభ్యులుగా యర్రాబాబు, ఏపూరి లతాదేవి, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ఆహ్వానితులుగా అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, బి.జి.క్లెమెంట్లు ఎన్నికయ్యారు.

సాబీర్ పాషాకు రాష్ట్ర స్థాయి పదవి ఆమోదయోగ్యం

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రజా నాయకుడు జిల్లాలో సిపిఐ పార్టీకి వెన్నుముకలా ఉన్న జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషాకు రాష్ట్ర కార్యవర్గంలో మూడవసారి కీలక పదవి ఇవ్వడం ఒక నిఖార్సైన కమ్యూనిస్టుగా ఆయనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని కొత్తగూడెం త్రీటౌన్ ఏరియా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ అన్నారు. శనివారం సాబీర్ పాషకు శాలువా కప్పి పూల బొకే అందించి యూసుఫ్ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయటానికి శ్రమిస్తున్న తీరు తమకు స్ఫూర్తినిస్తుందన్నారు. ప్రజలకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఎదురైనా సాబీర్ పాషా ఓపికగా, చాకచక్యంగా పరిష్కారం చేస్తూ జిల్లాలో సిపిఐ పార్టీని బలోపేతం చేస్తున్నారని కొనియాడారు. ఈ నెల 20 నుంచి మూడురోజులు హైదరాబాద్‌లో జరిగిన 4వ సిపిఐ రాష్ట్ర మహాసభలో ఆయనకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించిన ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతోపాటు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెంలో సాబీర్ పాషా నాయకత్వంలో సిపిఐ పార్టీ బలోపేతవానికి తమ వంతు కృషి చేస్తామని యూసుఫ్ అన్నారు

ఓట్ చోర్ కో హటావో... ప్రజాస్వామ్యం బచావో..

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తన జేబు సంస్థలా మారిన ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి పార్టీ దొంగ ఓట్లతో అక్రమంగా కేంద్రంలో అధికారం చాలా ఇస్తున్నారని ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆరోపించారు. మోడీ చేసిన ఓట్ చోరీ ఎలా పాల్పడ్డారో ఇటీవల తమ నాయకుడు రాహుల్ గాంధీ ఆధారాలతో సహా దేశ ప్రజల ముందు ఉంచారని తెలిపారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా శనివారం ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని ప్రియదర్శిని కళాశాల విద్యార్థులతో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా పని చేయాల్సిన ఎన్నికల కమిషన్ బిజెపి పార్టీకి దాసోహమై అతిపెద్ద ఓట్ల కుంభకోణానికి పాల్పడి గద్దెనెక్కారని విమర్శించారు. దొంగ ఓట్లతో అధికారం చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వం దిగిపోవాలని, నరేంద్ర మోడీ కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల దొంగతనం రాజ్యాంగం మీద జరిగిన దాడిగా ప్రజలు, యువతరం భావించి ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ నాయకులు షేక్ నయీమ్, ఠాకూర్ తరుణ్ సింగ్, కాటి సంతోష్, షేక్ సద్దాం, మహేష్, షేక్ మోహిన్, ఉర్సు శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందే

విశాలాంధ్ర - లక్ష్మీదేవి పల్లి : మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పాలన నడుస్తుందని ప్రజా పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బిజెపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు జీవీకే మనోహర్ విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి చేపట్టాక హామీలను నెరవేర్చడం లేదన్నారు. శనివారం బిజెపి ఆధ్వర్యంలో మండలంలోని చాతకొండ సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తాసిల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికోదిలేసారని విమర్శించారు. మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీనాయక్ మాట్లాడుతూ మైలారం రాగి గనులను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు పైడిపాటి రవీందర్, జల్లారపు శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ సాగర్, జీవీకే శివ, శివాజీ, నవీన్ కుమార్, కవిత, రమాదేవి, గౌరీ సంపత్, అరుణ, ధనలక్ష్మి, కళావతి, పాల్గొన్నారు.

నేషనల్ అవార్డుకు ఎనిమిది పాఠశాలలు ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ అవార్డుకు మెదక్ జిల్లాలో 8 పాఠశాలలు ఎంపికయ్యాయి. శనివారం హైదరాబాద్‌లోనీ నియో కన్వెన్షన్‌లో ఏడోటెక్ ఎక్స్పో ఆధ్వర్యంలో బెస్ట్ కరస్పాండెంట్ అవార్డులు అందజేశారు. మెదక్ పట్టణానికి చెందిన చైతన్య భారతి హైస్కూల్ కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డును అందుకున్నారు.

ఆదివాసీలకు ఉచిత ఉన్నత విద్య

విశాలాంధ్ర - భద్రాచలం : బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ద్వారా ఆదివాసి విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్య అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రొఫెసర్లు గుంటి రవీందర్, జి దయాకర్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం భద్రాచలంలో ఆ యూనివర్సిటీ అందిస్తున్న ఉచిత విద్యకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. హైదరాబాదు నుంచి భద్రాచలం వచ్చిన ప్రొఫెసర్లకు తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, నాయకులు రమణ, లక్ష్మయ్య, ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ దొర, నాయకులు ఇర్పా ప్రకాష్, పూణెం వరప్రసాద్, దుర్గారావ్, వీరభద్రం, ఐటిడిఏ డిడి మన్నెమ్మలు తొలుత స్వాగతం పలికారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. విద్య మీ ఇంటి దగ్గరికే అనే నినాదంతో తమ విశ్వవిద్యాలయం పనిచేస్తుందని ప్రొఫెసర్లు తెలిపారు. ఆదివాసీలకు ఉచిత విద్య అందించాలనే లక్ష్యంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు.

సురవరం మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

విశాలాంధ్ర - ఖమ్మం : సిపిఐ అగ్రనేతలో ఒకరు, మాజీ పార్లమెంట్ సభ్యులు సు రవరం సుధాకర్ రెడ్డి మృతితో భారత జాతీ ఒక పోరాట యోధున్ని కోల్పోయిందని సిపిఐ ఖమ్మం జిల్లా సమితితెలిపింది ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యార్థి దశ నుండి ప్రారంభమైన సుధాకర్రెడ్డి పోరాట జీవితం అనేక దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు తెలిపారు. విద్యార్థి జీవితంలో పాఠశాల సమస్యలపై మొదలైన ఆయన పోరాట జీవితం తుది వరకు కొనసాగిందన్నారు. విద్యార్థి నాయకునిగా, యువజన నాయకునిగా అఖిల భారత స్థాయిలో పని చేసిన సు రవరం పార్టీ జాతీయ కార్యదర్శిగా ఎన్నో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ విస్తరణకు కృషి చేశారన్నారు. మూడు దశాబ్దాల కాలంలో భారత పార్లమెంట్లో రూపుదిద్దుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టానికి సంబంధించి డ్రాఫ్ట్ తయారీలో సురవరం కీలక పాత్ర పోషించారని హేమంతరావు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పిస్తూ జిల్లా వ్యాపితంగా సంతాప సభలను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రియదర్శిని కళాశాలలో సంతాప సభ జరగగా అన్ని మండల కేంద్రాలలో సభలు నిర్వహించారు.

సురవరంకు జిల్లా సమితి ఘన నివాళి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి (83) శుక్రవారం మృతి చెందడం పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా సమితి నాయకులు బాధలు వ్యక్తం చేశారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో నాయకులు, కార్యకర్తలు సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి అయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి రాజకీయ, సామజిక జీవితమంతా ప్రజల సమస్యలకోసం, అసంఘటిత రంగ కార్మికులు, గిరిజనులు, సింగరేణి కార్మికులు, రైతుల హక్కులకోసం అంకితం చేశారన్నారు. దేశ రాజకీయాల్లో దిశా నిర్దేశం చేసే మహా నేతను కోల్పోవడం వామపక్షాలకు తీరని లోటన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, రమణమూర్తి, గెద్దాడు నగేష్, భూక్య శ్రీనివాస్, యాంద్ర మహేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి(83) అనారోగ్యంతో హైదరాబాదులో శుక్రవారం రాత్రి కన్ను మూయడం అత్యంత బాధాకరమని వారి మృతి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా, బి కే యం యు జాతీయ ఉపాధ్యక్షులుగా సిపిఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ నుండి రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికై వారు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్మిక కర్షక పీడిత జనావళి కోసం, ప్రజా హక్కుల కోసం పార్లమెంట్‌లో వారు ఘళమెత్తిన తీరు అమోఘమని, ప్రముఖ మార్క్సిస్టు మేధావిగా దేశ రాజకీయాలలో చెరగని ముద్ర వేశారన్నారు. సుధాకర్ రెడ్డి గారి ఆశయాల సాధనకు కృషి చేయడమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదని వెంకట్రాములు తెలిపారు.

విశాలాంధ్ర-వనపర్తి : సురవరం సుధాకర్ రెడ్డి మరణించిన ఆయన సమసమాజ ఆశయం, ఎర్రజెండా మరణం లేదని సిపిఐ వనపర్తి నియోజకవర్గం కార్యదర్శి రమేష్ అన్నా రు. శనివారం సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యం లో వనపర్తి అంబేద్కర్ చౌకులో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

మృతికి సంతాపం తెలిపారు. సమసమాజ ఆశయం కోసం పేదల పక్షాన అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సిపిఐ కీలకపాత్ర పోషించారన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షులు కళావతమ్మ, కవి జనజ్వాల, రిటైర్డ్ ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ, శ్రీదేవి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుతుబు,ఎత్తం మహేష్, రమణ, తాపీ మేస్త్రీల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, ఎస్టి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు గంధం నాగరాజు, గోపాల్పేట మండల కార్యదర్శి శాంతయ్య, పానుగల్ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, ఏదుట్ల గ్రామ కార్యదర్శి కోటయ్య, బాలేమియా, వెంకటమ్మ, జ్యోతి, సుప్రియ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గూడూరు: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆల్ ఇండియా మాజీ కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల ఎం సి పి ఐ యు పార్టీ ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ విప్లవ జోహార్లు సమర్పించింది. కామ్రేడ్ సుధాకర్ రెడ్డి మరణం యావత్తు దేశ వామపక్ష ఉద్యమాలకు పేద ప్రజలకు తీరని లోటని సిపిఐయూ పార్టీ మహబూబాద్ జిల్లా సహా కార్యదర్శి నూకల ఉపేందర్ ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడుతూ ఘనంగా నివాళులర్పించారు.

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి దేవరకొండ బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ మండల పార్టీ కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా సిపిఐ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బడుగు బలహీన అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రజా పోరాటాలు చేసి భారత కమ్యూనిస్టు పార్టీ ముందు భాగంలో ఉండేందుకు ఆయన వంతు ఎంతో కృషి చేసేవారన్నారు. సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, జూలూరు వెంకట రాములు, నీల వెంకటయ్య, యాదయ్య, గోవర్ధన్, శ్రీను, మహేష్, లింగమయ్య, వాహబ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటీయుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్‌లు అన్నారు. సురవరం మృతికి సంతాప సూచకంగా స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఉన్న జెండాలను కనకరాజు అవనతం చేయగా, జనగామలో ఉన్న సిపిఐ జెండా ను సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్, పైవింక్లయిన్ చౌరస్తాలో ఉన్న సిపిఐ జెండాను సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్‌లు అవనతం చేయడం జరిగిందని, ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు మాట్లాడుతూ తొలినాళ్ల నుండి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని ఆయన పేర్కొన్నారు. ఆయనకున్న ఆస్తులను ప్రజలకు ధారా దత్తం చేసి ప్రజాసేవలో నిమగ్నమైన నిబద్ధతగల నేతని, సిపిఐ కి మూడు పర్యాయాలు జాతీయ కార్యదర్శిగా, పార్లమెంటు సభ్యులుగా రెండు సార్లు పనిచేసిన ఆయన ఆ పదవులకు వన్నెతెచ్చారని ఆయన అన్నారు. సురవరం ఆశయాల సాధన కోసం పయనిస్తూ ఆయన చూపిన మార్గాన ముందుకు సాగుతామని అన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఏఐటీయుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు గోసిక మోహన్, తాళ్ళపల్లి మల్లయ్య, మడికొండ ఓదేమ్మ, మాటేటి శంకర్, ఎం.ఎ.గౌస్, రాష్ట్ర, జిల్లా సిపిఐ ప్రజా సంఘాల నాయకులు బాలసాని లెనిన్ సూర్య, ప్రీతం, నవీన్, ఆసాల రమ తదితరులు ఉన్నారు.

సంపాదకీయం

పౌరసత్వ నిరూపణ తంటా

మన దేశంలో ప్రజలకు పౌరసత్వం నిరూపించుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి దస్తావేజులూ ఇవ్వదు. కానీ ఒక వర్గానికి చెందిన వారిని రెండవ శ్రేణి పౌరులుగా దిగజార్చడానికి ఈ మధ్య కాలంలో పౌరసత్వం నిరూపించుకోవాలన్న ఒత్తిడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే కొంతమందిని బలవంతంగా సరిహద్దు దాటించేసి బంగ్లాదేశ్ లోకి తోసేస్తున్నారు. తాజాగా ఓ గర్భిణీని బలవంతంగా బంగ్లాదేశ్ సరిహద్దు దాటించేశారు. తాము ఏరివేయదలచుకున్న వారి ఇళ్లను బుల్డోజర్లు వినియోగించి కూల్చేస్తున్నారు. వారికి తల దాచుకోవడానికి నీడ లేకుండా చేస్తున్నారు. అలాంటి వారు తమ దగ్గర ఉన్న ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లాంటివి చూపితే అవి చెల్లవు పొమ్మంటున్నారు. ఇవన్నీ నకిలీవి కావొచ్చునని దబాయిస్తున్నారు. సాక్షాత్తు ఓ సుప్రీంకోర్టు న్యాయమూర్తే తాను ఈ దేశ పౌరుడినని నిరూపించుకోవడానికి తన దగ్గర పత్రాలేవీ లేవని నిండు కోర్టులోనే చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో చదువు లేని వారు, పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఎలాంటి దస్తావేజులు ఎక్కడ, ఎలా సంపాదించాలో తెలియని వారి గతి ఏమిటి? ప్రభుత్వ దృష్టి ప్రధానంగా ముస్లింల మీదే కేంద్రీకరించి ఉందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పౌరసత్వం నిరూపించుకోవాల్సిన బాధ ఎక్కువగా ముస్లింలకే ఎదురవుతోంది. కొన్ని రాష్ట్రాలలో అయితే పౌరసత్వం అనుమానంగా తోచిన వారిని నిర్బంధ శిబిరాల్లో తోసేస్తున్నారు. ఈ సమస్య ఒక్క అసోం లాంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం కావడం లేదు. జాతీయ పౌరసత్వ చట్టాన్ని అసోంలో అమలు చేయడానికి గతంలో చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. దాదాపు 19 లక్షల మంది భవిష్యత్తు అంధకారంలో కూరుకు పోయింది. అసోం, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలలో బంగ్లా, అస్సామీ భాషలు మాట్లాడే ముస్లింలు కూడా నానా రకాల కష్టాలు అనుభవించవలసి వస్తోంది. మహారాష్ట్రలో కూడా "చొరబాటుదార్లు" ఉన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరు చొరబాటుదార్లో తేల్చడానికి ప్రభుత్వం ముందుగా నోటీసు ఇచ్చిందీ లేదు. ఇదంతా ఏకపక్షంగానే సాగిపోతోంది. నిర్బంధాలను, ఈ దేశం నుంచి పంపించి వేయడాన్ని తప్పించుకోవడం కోసం చాలా మంది తమ జీవనోపాధిని కూడా వదిలేసి దిక్కు తోచని చోట్లకు తరలి పోతున్నారు. ప్రభుత్వం అడుగుతున్న పత్రాలు సంపాదించడానికి పనీపాట వదిలేసి వారాల తరబడి అధికారుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన దుస్థితి ఎదురవుతోంది. కొన్ని సందర్భాలలో అయితే ఒకే కుటుంబంలోని కొందరిని పౌరులుగా గుర్తిస్తున్నారు. అదే కుటుంబంలోని మరికొందరిని మీరు పౌరులు కాదు పొమ్మంటున్నారు. దీనితో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. చెట్టుకొకరు పుట్టకొకరు అన్న రీతిలో గడుపుతున్నారు. ఈ క్రమంలో లక్షలాది మంది రెండవ శ్రేణి పౌరులుగా దిగజారవలసిన దుస్థితి ఉంది. కొందరైతే పౌరసత్వాన్నే కోల్పోవాల్సిన దుర్భర స్థితిలో పడి పోతున్నారు. ఈ ఏరివేత కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ శంఖంలో పోసేశారు. మోదీ ముస్లింల పేరెత్తకుండానే జనాభా స్వరూప నిర్ధారణకు ఓ యజ్ఞం చేపట్టబోతున్నామని ప్రకటించారు. అంటే ఇప్పటివరకు కేవలం వేధింపుల ద్వారా కొనసాగిన ఏరివేత ఇక మీదట అధికారికంగానే అమలవుతుందన్న మాట.

కొన్ని రాష్ట్రాలలో చొరబాటుదార్లు తిష్ఠ వేశారని మోదీ చెప్పారు. ఆ క్రమంలోనే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై నిరాధారమైన నిందలు మోపారు. చొరబాటుదార్లు అంటే అక్రమంగా సరిహద్దు దాటి వచ్చే వారే కదా! అలాంటి వారిని నిరోధించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే కదా! సరిహద్దులను కాపలా కాసేది సరిహద్దు భద్రతా దళం, సైన్యం. ఈ రెండూ కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉన్నప్పుడు రాష్ట్రాల మీద నింద మోపడంలో ఔచిత్యం ఏమిటో తెలియదు. ఇంతవరకు అనధికారికంగా కొనసాగిన ఏరివేత కార్యక్రమాన్ని ఇక మీదట అధికారికంగా కొనసాగిస్తారన్న మాట. దేశ జనాభా స్వరూపాన్ని పనిగట్టుకుని మార్చేస్తున్నారని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పారు. ఇది కుట్ర అని కూడా అన్నారు. కొత్త సంక్షోభానికి బీజాలు వేస్తున్నారట. ఈ చొరబాటుదార్లు మనవారి ఉపాధిని, జీవనోపాధిని లాగేస్తున్నారట. ఈ చొరబాటుదార్లే మన స్త్రీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారట. ప్రధానమంత్రి ఉద్దేశంలో అది లవ్ జిహాద్ కావొచ్చు. ఆయన ఆ మాట స్పష్టంగా చెప్పలేదు కానీ అంతరార్థం అదే. లవ్ జిహాద్ గురించి సంఘ్ పరివార్, దానికి అనుబంధ సంస్థ అయిన బీజేపీ కొన్నేళ్లుగా నానా యాగీ చేస్తున్నాయి. కానీ లవ్ జిహాద్ కొనసాగుతున్నట్టు ఒక్క సందర్భంలోనూ రుజువు కాలేదు. యువతీ యువకులు ఒకరినొకరు ఇష్టపడితే అందులో పురుషుడు ముస్లిం అయితే దానికి సునాయాసంగా లవ్ జిహాద్ ముద్ర వేసేసి ముస్లింల మీద విద్వేషం పెంచేస్తున్నారు. జనాభా స్వరూప మిషన్ ఎలా పని చేస్తుందో, దాని పరిధి ఏమిటో, పని తీరు ఎలా ఉంటుందో మాత్రం మోదీ చెప్పనే లేదు. అంటే ముస్లింల మీద విద్వేషం నింపడానికి సంఘ్ పరివార్ మూకలకు పచ్చ జెండా ఊపేశారన్న మాట. పౌరసత్వం మీద చెలరేగుతున్న వివాదాలలో కొన్ని సుప్రీంకోర్టు పరిశీలనకు చేరాయి. పనిగట్టుకుని జారీ చేసిన ఆధార్ కార్డులను పౌరసత్వానికి రుజువుగా భావించబోమని ఎన్నికల కమిషన్ ధిక్కార స్వరం వినిపించింది. ఆధార్ కార్డులు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వమే. తాము ఇచ్చిన కార్డులను తామే ఆమోదించబోం అనడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం. ఈ కార్డులు నకిలీవి తయారు కావొచ్చుట. ఈ నకిలీ కార్డులను నిరోధించవలసింది కేంద్ర ప్రభుత్వమే కదా! ఆ బాధ్యతను పౌరుల మీదకు నెట్టేయడం విడ్డూరమే. బిహార్ లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేసే పని కొనసాగుతోంది. ఓటర్ల జాబితా ఎప్పటికప్పుడు సిద్ధం చేయవలసిన, సవరించిన, ఓటర్లు కాని వారి పేర్లు జాబితాలోంచి తొలగించడం, అర్హులైన వారి పేర్లు జాబితాలో చేర్చడం ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారమే. కానీ ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలో కొత్తగా ఓటర్ల జాబితాలో చేర్చిన ఉదంతాలు కనిపించడంలేదు. 65 లక్షల మంది పేర్లు తొలగించేశాం పొమ్మన్నారు. ఎవరి పేర్లు తొలగించారో వెల్లడించబోమని ఎన్నికల కమిషన్ చాలా రోజుల పాటు మొండికేసింది. సుప్రీంకోర్టు ఒత్తిడివల్ల ఆ జాబితా ప్రకటించక తప్పలేదు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల మిషతో ఎన్నికల సంఘం తనకు లేని అధికారాన్ని వినియోగించుకుని పౌరసత్వ నిర్ధారణ బాధ్యతను నెత్తికెత్తుకుంది. ఈ బాధ్యత తలకెత్తుకోవడం ఎన్నికల కమిషన్ పుర్రెలో పుట్టిన బుద్ధి అయి ఉండదు. కేంద్ర ప్రభుత్వ, ముఖ్యంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలతోనే ఈ భారం మోస్తున్నట్టు కనిపిస్తోంది. ఎవరు పౌరులో, ఎవరు పౌరులు కాదో నిర్ధారించే పత్రాల లాంటివి ఇచ్చే సంప్రాదాయం లేని చోట పౌరసత్వం నిరూపించుకోవడానికి దస్తావేజులు చూపించాలనడం కచ్చితంగా ముస్లింలపై ఎక్కుపెట్టిన అస్త్రమే.

రాజ్యాంగ రక్షణకు ప్రతిపక్షాల పోరు

డా. జ్ఞాన్ పాఠక్

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు పాలక పార్టీ వైఖరి మూలంగా వృథా అయిపోయాయి. అయితే ప్రతిపక్షాలు రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ సమావేశాలను వినియోగించుకు న్నాయి. ఈ సమావేశాలు 2025 ఆగస్టు 21తో ముగిశాయి. పాలక పార్టీ మూడు చట్టాలను ఆమోదించి తన నిరంకుశత్వాన్ని బైటపెట్టుకుంది. రాజ్యసభ, లోక్‌సభలో ప్రతిపక్షాలు కోరిన అంశాలపై చర్చించడానికి పాలకులు ఏమాత్రం అంగీకరించలేదు. అయితే నిరంకుశమైన మూడు చట్టాలను తీసుకురావడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ప్రతిపక్షాలు వాక్‌అవుట్‌లు జరపడంవల్ల వచ్చిన అవకాశాన్ని నిరంకుశ చట్టాలను ఆమోదించడానికి ఉపయోగించుకుంది. ఈ చట్టాలను పాలకపక్షం మాత్రమే సమయాన్ని తీసుకుని ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసింది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు అరెస్టయి 30 రోజులు జైళ్లలో ఉన్నట్లయితే 31 వ రోజు తమంత తామే పదవుల నుంచి తప్పుకోవాలని నిరంకుశ చట్టాన్ని లోక్‌సభలో ఆమోదించారు. ఇందులో ఏ మాత్రం న్యాయం లేదు. ఛార్జిషీటు కూడా లేకుండానే పైన పేర్కొన్న ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు తమంతట తాము వైదొలగాలని ముసాయిదా బిల్లులను రూపొందించారు. వర్షాకాల సమావేశాల్లో ఏమాత్రం లోతుగా చర్చ జరగలేదు. అలాగే ఈ సమావేశాల్లో ఎలాంటి ప్రజాప్రయోజనం కలిగిన చర్చలు జరగలేదు. ఉభయ సభల్లోనూ సమస్యల ఆధారంగా చర్చలు జరగకుండా కాలం వృథా అయింది. అయితే ప్రతిపక్షాలను వేధించడం కోసం ఈ చట్టాలు పాలకులు ఉపయోగించుకోనున్నారు. సమస్యలను చర్చించడానికి పాలక ఎన్‌డీఏ ప్రభుత్వం ఏమాత్రం అంగీకరించలేదు. ఆపరేషన్ సిందూర్ అంశాన్ని మాత్రమే చర్చించేందుకు ప్రతిపక్షాల తీవ్ర పోరాటం అనంతరం ప్రభుత్వం అంగీకరించింది. ఇండియా ఐక్య సంఘటన సమావేశాలు జరిగినంత కాలం చర్చలు జరగకుండా పాలకులు సమయాన్ని వృథా చేశారు. లోక్‌సభలో అనేకసార్లు అంతరాయం జరగడం మూలంగా సభ 29 శాతం మాత్రమే జరిగింది. రాజ్యసభ 34 శాతం సమయం జరిగింది. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం 23 శాతం మాత్రమే జరిగింది. రాజ్యసభకు 6 శాతం సమయం మాత్రమే ఉపయోగపడింది.

ఈ సమావేశాల్లో పాలకులకు ఉపయోగపడే చట్టాలను లోతుగా ఏ మాత్రం చర్చించలేదు. చట్టాలను కొన్ని నిమిషాల్లో అంగీకరిస్తారనగా తక్కువ సమయం బిల్లుల మీద చర్చ జరిగింది. బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టి పరిశీలనకు కమిటీలను నియమించారు. స్టాండింగ్ కమిటీలకు సంబంధించిన శాఖలకు ఏ బిల్లులను సమర్పించలేదు. లోక్‌సభ 50 శాతం ఆపరేషన్ సిందూర్‌పైన చర్చించడం కోసం సభను వినియోగించలేదు. ఏ సభలోనూ ప్రైవేటు సభ్యులు ప్రవేశపెట్టిన అంశాలను చర్చకు తీసుకోలేదు. 2019 జూన్ నుంచి లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ లేరు. అంటే ఉభయసభల్లో చర్చలు ఎంత బాగాసాగుతున్నాయో దీనివల్ల అర్థం అవుతోంది. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్లజాబితా (ఎఫ్ఐఆర్) సవరణ జరగడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య మూడురోజులు మాత్రమే యుద్ధం జరిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకుని తానే యుద్ధాన్ని నిలిపివేశానని దాదాపు 29 సార్లు ప్రకటించినప్పటికీ ప్రధాని మోదీ స్పందించనేలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ పనిచేసిన కాలం తగ్గిపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌పైన (సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.

ప్రతిరోజూ స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాన్ని నిందిస్తూ కావాలని అంతరాయం కలిగించినట్లుగా ఆరోపించారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన మొదటిరోజు రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి అయిన జగదీప్ ధన్కర్ రాజీనామా చేశారు. పాలకపక్షం వత్తిడిచేయడంతో ధన్కర్ రాజీనామా చేసినట్లుగా వార్తలు వచ్చాయి. దిల్లీ హైకోర్టు జడ్జి యశ్వంతశర్మను తొలగించేందుకు ప్రతిపక్షాలు చర్చకు అవకాశం ఇవ్వవలసిందిగా ప్రతిపక్షం ఇచ్చిన విజ్ఞాపన పత్రాన్ని ధన్కర్ అంగీకరించడం పాలకుల వత్తిడికి ప్రధాన కారణమని చెబుతున్నారు. పాలక పక్షం ప్రతిపాదించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రతిపక్షానికి ప్రాధాన్యత ఇచ్చారని నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపరాష్ట్రపతి రాజీనామాకు కారణమయ్యారని తెలుస్తోంది. రాజీనామా చెయ్యకపోతే ధన్కర్‌ను ఇంపీచ్(తొలగింపు) చేయాలని పాలకులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అనేక సమస్యలపైన ధన్కర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతు సమస్యలపైన కూడా ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. ఈ అంశాలన్నీ ధన్కర్ రాజీనామాకు దారితీశాయి. జస్టిస్ యశ్వంత్ వర్మ (ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు జడ్జి)ను తొలగించడంకోసం ప్రతిపాదన చేయగా, లోక్‌సభ స్పీకర్ అంగీకరించారు. ముగ్గురు సభ్యులు గల కమిటీని పరిశీలించడానికి నియమించారు. ఎస్ఐఆర్ సమస్యపైన ప్రతిపక్షం సభ లోపల, వెలుపల తీవ్రఆగ్రహం వ్యక్తం చేసింది. భారత ఎన్నికల కమిషన్ బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్లను తొలగించడం ప్రతిపక్షాలకు ముఖ్యమైన విషయం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్ మోదీ ప్రభుత్వంతో కుమ్మక్కై ఓటర్ల జాబితాను తారుమారు చేసిందని విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని అలాగే హర్యానా, మహారాష్ట్ర, దిల్లీ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లోనూ ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ విమర్శించారు. ఓట్ల చోరీకి ఈసీఐ అనుమతించిందని బీజేపీకి అనుకూలంగా ఓట్లు వేయడానికి సహకరించిందని, ప్రత్యేకించి నరేంద్ర మోదీ నేరుగా ప్రయోజనం పొందారని ఆరోపించారు.

విద్యా విప్లవజ్యోతి శివరామ్

సత్యాన్వేషణ స్పృహతో, స్వతంత్ర ఆలోచనలతో, నిర్భీత జీవన ఎరుకతో జీవించిన అరుదైన తాత్వికుడు, విద్యా విప్లవకారుడు మంచిరెడ్డి శివరామ్ (85). ఆయన జీవితం ఒక సాధారణ కథ కాదు - అది స్వేచ్ఛా స్పర్శతో, ప్రేమతో, అవగాహనతో నిండిన ఒక ప్రజ్ఞా ప్రవాహం. అనంతపురం నుంచి విజయవాడ వరకు రెండున్నర దశాబ్దాలుగా అనేక మంది మనసులను స్పర్శించిన ఈ విద్యావేత్త, విఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలను జీవన సత్యంగా మలిచి, విద్యను కేవలం పుస్తక జ్ఞానంగా కాకుండా జీవనానుభవంగా రూపొందించారు. 2025 ఆగస్టు 20న విజయవాడలో ఆయన కన్నుమూసినా, తన చివరిరోజుల్లో కూడా 'మనం చాలా మొండోళ్లం కదా.. అంత తొందరగా వెళ్లం!' అని నవ్వుతూ, మరణాన్నే సహజ స్వీకారంలా చూశారు. 'బతుకు గానీ, చావు గానీ - దాన్ని ఎలా ఆహ్వానిస్తామన్నదే అసలు విషయం' అనే ఆయన మాటలు ఎప్పటికీ ధైర్యవచనాలు, దిశానిర్దేశాలు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, స్వేచ్ఛ, ప్రేమ, అవగాహనలతో నిండిన ఆయన జీవన దీపం విద్యా రంగంలో చిరస్థాయిగా వెలుగుతూనే వుంటుంది. అనంతపురం నేలలో జన్మించి, మదనపల్లి, హైదరాబాదు, నెల్లూరు జిల్లా పల్లెపాడు గడ్డపై సత్యాన్వేషణ యాత్ర సాగించి, 2002 లో విజయవాడకు చేరిన శివరామ్... శాంతి విద్యావనం, అరవింద స్కూల్ వంటి సంస్థలతో కలిసి విద్యారంగంలో దీపశిఖగా నిలిచారు. జిడ్డు కృష్ణమూర్తి (జె.కె) భావాలను సిద్ధాంతాలుగా కాకుండా జీవన సత్యంగా ఆచరించి, ఆదర్శంగా నిలిచారు.

ఆధునిక విద్యా వ్యవస్థపై నిప్పులు

'విద్య పేరుతో వినాశనం జరిగింది. పిల్లల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దల్ని 'మెథడ్స్' అనే పేరుతో ఇరికించి పెట్టారు. స్కిల్స్, స్కిల్స్ అంటూ వారిని కండిషన్ చేశారు. అనుభూతి, హృదయంతో లయం కావడం పూర్తిగా పోయింది. మనిషిని పిదపజీవిగా, క్రిమికీటకంగా మార్చేశారు!' అని శివరామ్ ఆధునిక విద్యావ్యవస్థపై నిప్పులు చెరుగుతారు. శివరామ్ తాత్వికతలో విద్య ఒక ప్రధాన భాగం. ఆయన విద్యను కేవలం మార్కులు, ర్యాంకుల కోసం ఇచ్చే శిక్షణగా కాకుండా, పిల్లల సహజసిద్ధమైన సృజనాత్మకతను వెలికితీసే ఒక ప్రక్రియగా భావించారు. మనిషి అంతరంగాన్ని మేల్కొలిపే శక్తిగా చూశారు. శివరామ్ ఒక ఉపాధ్యాయుడే కాదు, ఒక ఉద్యమకారుడు. విద్యను పుస్తకాలలో కట్టిపెట్టకుండా, దాన్ని ఒక జీవనానుభవంగా మార్చే ప్రయత్నం చేశారు. ఆయన వర్క్‌షాప్‌లలో పాఠ్యపుస్తకాలు, బోర్డులు, గీసిన దయాగ్రంల కంటే విద్యార్థుల ఊహాశక్తి, సంభాషణ, కల్పనాశక్తి ఎక్కువ ప్రాధాన్యం పొందాయి. ఆయన బోధనలో సాహిత్యం, కళ, సామాజిక సమస్యలు అంతర్లీనమై వుండేవి. శివరామ్ భౌతికంగా లేకపోయినా ఆయన మాటల వెలుగు ఎప్పటికీ ఆరిపోదు. మనం చదివిన పాఠాలు మరచిపోవచ్చు, కానీ ఆయన చూపిన దారిని మాత్రం తప్పిపోలేం. ఎందుకంటే, అది పుస్తకాల్లో కాదు - మన హృదయాల్లో రాసిన పాఠం. సాధారణ మాటల్లో అసాధారణ భావాన్ని నాటే శక్తి ఆయనది. తన ప్రశాంత స్వభావం, నిజాయితీ, ఆలోచనల లోతుతో ఆయన అందరి మనసులను తాకేవారు. ప్రశ్న విన్నాక మౌనంగా ఆలోచించి ఇచ్చే ఆయన సమాధానం మనసును కదిలించేది.

ఆరాధన భావాన్ని బద్దలుకొడతారు

తను ఎవరినో, ఏ రచననో ఉదాహరించడం కాకుండా నేరుగా జీవితంలో నుంచి సూటిగా, స్పష్టంగా అపూర్వ దృష్టికోణంతో మాట్లాడతారు. జీవితాన్ని నేరుగా, వంకర లేకుండా చూసిన తత్వవేత్త. అనంతపురంలో జన్మించిన శివరామ్, సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డి అనుచరుడు. జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలతో లోతైన సంభాషణ కొనసాగించిన అన్వేషకుడు. ఆధునిక, ప్రాచీన సాహిత్యాలలో అసాధారణ ప్రతిభ కలిగినవాడు. పాల్కురి సోమనాథుడు నుంచి టాగూర్, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆధునిక రచయిత, జర్నలిస్ట్ అరవింద్ అడిగా వరకు అలవోకగా కోట్ చేసే ఆయన, జె.కె తాత్విక దృష్టిపై ప్రత్యేక అభిమానం వున్నప్పటికీ ఆరాధన భావాన్ని ఎప్పటికప్పుడు బద్దలుకొడుతుంటారు. 'కొత్తగా కృష్ణమూర్తి (జె.కె) కండిషనింగ్‌తో మనుషులు తయారవుతున్నారు. ఇప్పుడు ఈ కండిషనింగ్ చాలా పెద్ద ప్రమాదం అయి కూర్చుంది' అంటారు. కృష్ణమూర్తి బోధనలను కూడా ఒక సిద్ధాంతంగా మార్చుకోవడం, వాటిని పునరావృతం చేయడం వల్ల అసలైన జ్ఞానం పోతుందని చెబుతారు. కండిషనింగ్‌ను బహుముఖాల్లో స్పర్శిస్తారు. మైండ్‌ను ఎంత స్టుపిడ్‌గా, ఎంత డల్‌గా, మెకానికల్‌గా, రొటెన్‌గా చేసుకుంటున్నామో కళ్లకు కడతారు. పారదర్శకమైన మాటలు, నిర్మలమైన ఆలోచనలు - అదే శివరామ్ ప్రత్యేకత. అనుభవంతో ముడిపడిన నిజాయితీ. ఆయన పలికిన ప్రతి వాక్యం ఒక సిద్ధాంతం కాదు, ఒక పుస్తకం, పాఠమో కాదు - అనుభవం నుంచి పుట్టిన స్వచ్ఛమైన జీవన సత్యం.

సృజనాత్మక విద్యలో కొత్త పుంతలు

శివరామ్ కమ్యూనిస్టు భావజాలంలో పెరిగి, జిడ్డు కృష్ణమూర్తి భావాలకు ఆకర్షితులై, 1973 లో రిషి వ్యాలీ చేరారు. అక్కడ గ్రామీణ పిల్లల కోసం 'రూరల్ ఎడ్యుకేషన్ సెంటర్' ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ 'ఒయాసిస్'లో చేరారు. తర్వాత నెల్లూరు జిల్లా పల్లెపాడులో ఇంగ్లాండుకు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత ఎలీనా వాట్స్‌తో కలిసి 'సృజన స్కూల్' ఏర్పాటు చేసి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు. అయితే, ఒకేచోట స్థిరంగా వుండడం ఆయన స్వభావం కాదు. కాలపు భిక్షువులా ఆయన ప్రయాణించారు. 2002 లో విజయవాడలో 'స్టెప్' (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్) ప్రారంభించారు. జె.కె విద్యాతత్వాన్ని స్కూళ్లలో పరిచయం చేయడమే 'స్టెప్' ఉద్దేశం. ఒంగోలు, నెల్లూరు మొదలైన జిల్లాల్లో దీని కార్యకలాపాలు విస్తరించాయి. విద్యను

వ్యాపారంగా మార్చకుండా, పిల్లల సహజ శక్తులను వికసింపజేయాలని నిర్మొహమాటంగా చెప్పేవారు. 'స్కూలు అంటే విరామం. భయం, బహుమతులు, పోలికలు లేని వాతావరణం కల్పించండి' అని సూచించేవారు. తాను నమ్మిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. ఒకానొక స్కూలు వార్షికోత్సవంలో 'పిల్లల్ని 'కోళ్ల ఫారాల' లో పెట్టి ఎందుకు చదివిస్తున్నార'ని శివరామ్ ప్రశ్నించినపుడు, ఆ స్కూల్ ప్రిన్సిపాల్ కన్నీరు పెట్టుకున్నారు. బుజ్జగింపు ధోరణికి బదులు, షాక్‌లు ఇచ్చి ఎదుటివారిని ఆలోచింపజేసే తత్వం ఆయనది.

మనలను కదిలించే శివరామ్ మాటల తూటాలు

'ఏముంది మాట్లాడడానికి. ఏముంది చెప్పడానికి. స్పందన మొత్తంగా చచ్చిపోయింది. స్టకప్ అయిపోయాం అనిపిస్తుంది. అసమర్థత, అసహాయత, డొల్లతనం నుంచి ఎలా బయటపడాలి. దీన్ని బ్లాస్ట్ చేయాలి. మనసులో, ఆలోచనల్లో తూటాలు పెట్టి బ్లాస్ట్ చేయాలి. లేకపోతే జీవితం యాంత్రికంగా నడుస్తుంది. గాఢమైన మార్పు లేకుండా మనలో ఏ సృజనాత్మకతా వుండదు' 'ఆర్ట్, క్రాఫ్ట్, సినిమా, సాహిత్యం, మీడియా... ప్రతిదీ దిగజారిపోయింది. స్కూళ్లలో పాఠ్య పుస్తకాలు అవుట్ డేటెడ్. అప్ డేట్లో లేవు. టీచర్స్ అప్డేట్‌గా వుండాలి. కానీ లేరు. పాఠ్య పుస్తకాలను వల్లె వేయడమే టీచర్స్ పనవుతోంది. విద్య అంటేనే బట్టీ పట్టడం, వల్లె వేయడం అయిపోయింది. మొత్తంగా మనిషి జీవితమే ప్రజెంట్‌లో లేకుండా పోతోంది. ప్రతిదాన్ని ప్రశ్నించగలగడమే దీనికి పరిష్కారం. స్ట్రాటజీస్ ఏమీ పనిచేయవు. ప్రతిదాన్ని ప్రశ్నించగలగాలి. నిరంతరం స్పందించాలి. ఎంత తీవ్రంగా స్పందిస్తున్నామన్నదే ప్రశ్న' 'మన సంఘర్షణకి మూలం సంబంధాల్లో మనకుండే తగులాటం. ఒకవైపు వాళ్లని మనం ప్రేమించలేక పోతున్నాం. మరోవైపు వాళ్లతో తగులాటాన్ని, సాంగిత్యాన్ని, బంధాన్ని వదులుకోలేక పోతున్నాం. ఈ బంధాలన్నీ ఎప్పటికప్పుడు సంఘర్షణల్ని సృష్టిస్తున్నాయ్-కావా?' అనుభవంతో మనిషి నేర్చుకుంటాడా, నేర్చుకోలేడు. ఇన్ని వేల యేళ్ల చరిత్ర, జీవితం, యుద్ధాలు, రగడలు, రామాయణాలు, వినాశనం ఈ అంతటి నుంచి మనిషి ఏమైనా నేర్చుకోగలిగాడా? ఏమీ నేర్చుకోలేదు. చేసిన పొరపాట్లే చేస్తున్నాడు. అవే ద్వేషాలు, పగలు, ఆవేశాలు, దుర్మార్గాలు. మళ్లీ చరిత్రను తిరిగి దోడుకుంటున్నాడు. ఈ అనుభవమే ప్రతిబంధకం అవుతోంది. అతనిలోని తక్షణ సూక్ష్మ గ్రహణశక్తి విస్ఫోటనం అవకుండా అడ్డుపడుతోంది. అనుభవం గుదిబండలా తయారయ్యింది. ఏ క్షణానికాక్షణం మనిషి అనుభవం నుంచి, అన్ని రకాల అనుభవాల నుంచి విముక్తి అవగలిగిన మెలకువ, ఎరుక వుంటే గాని మనిషి తనలోని సద్యస్ఫురణని నిలుపుకోలేడు. విద్యలో ప్రధానంగా దీన్ని గ్రహించాల్సి వుంది మనం'.

ఆయన జీవితం ఒక సందేశం

'విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానం కాదు, మానవతా స్పర్శ'. జ్ఞానం కేవలం పుస్తకాల్లో వుండదని, అది జీవితం లోంచి పుడుతుందని దృఢంగా నమ్మిన విద్యావేత్త, తత్వవేత్త శివరామ్. ఇంత సత్యనిష్ఠ, ఇంత ప్రేమ, ఇంత ప్రశాంతత కలిగిన మనిషి లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిది. మనలో జీవన వెలుగులు నింపిన శివరామ్ ఇక లేరని అంగీకరించడం కష్టమే. ఇక ఆయనను చూడలేమన్న బాధ గుండెను తాకుతున్నా - ఆయన చూపిన దారి, ఆయన పంచిన ఆప్యాయత, ఆయన మిగిల్చిన ఆలోచనలు మనతోనే వుంటాయి. శివరామ్ జీవితం, బోధనలు, ఆలోచనలు ఎందరినో ప్రభావితం చేశాయి. జె.కె భావాలను అర్థం చేసుకోవడంలో ఆయన చూపిన మార్గం విశేషమైనది. విజయవాడలో అడుగుపెట్టినప్పటి నుంచీ శివరామ్‌ని ఒక కుటుంబ సభ్యుడిలా ఒడిలో చేర్చుకున్న అరవింద స్కూల్ ఇంద్రాణి కుటుంబం, అలాగే హృదయపూర్వక ఆప్యాయతను అందించిన శాంతి విద్యావనం పర్వతనేని కిషోర్ (లేట్), రాజ్యలక్ష్మి కుటుంబం పాత్ర ఆయన జీవితంలో చిరస్మరణీయం.

శివరామ్ ఒక ఆధునిక బౌద్ధ భిక్షువు:

కమ్యూనిస్టు ఉద్యమం నుంచి జె.కె వెలుగుబాట వరకు ఆయన జీవితం అన్వేషణ సాగరం. ఒక స్థిరమైన వ్యవస్థలో వుండలేదు. బుద్ధుడిలా, జె.కె.లా ఒక నిరంతర ప్రయాణం. భౌతిక, తాత్విక మార్పుల మేళవింపు. స్వతంత్ర సత్యాన్వేషణే మనిషి కర్తవ్యమని నమ్మి, వ్యక్తి వికాసం ద్వారా సామాజిక పరివర్తన సాధ్యమని స్వయానా చూపారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆలోచనలు, మాటలు, ఆయన వెలిగించిన ప్రజ్ఞాజ్యోతులు సదా మనకు మార్గదర్శకంగా వుంటాయి. పిల్లలు వికసించే విద్య, తక్షణంలో జీవించడమే జీవితమన్న ఆయన సూత్రాలు ఆయన జీవితాన్ని నిర్వచించాయి.

విద్యారంగానికి తీరని లోటు

శివరామ్ మరణం విద్యారంగానికి తీరని లోటే కానీ, ఆయన భావాలు ఇక స్ఫూర్తి పాఠాలు. పిల్లల మనసుల్లో స్వేచ్ఛను నింపడం, జీవితంలో ప్రేమను పంచడం - ఇదే ఆయనకు నిజమైన శ్రద్ధాంజలి. శివరామ్‌కి అంతిమ వీడ్కోలు సందర్భంలో పాల్గొన్న అభిమానులు, మిత్రులు, శిష్యులు అందరూ ఒకే స్వరంతో చెప్పిన మాట ఏమిటంటే - 'ఆయన కేవలం విద్యావేత్త మాత్రమే కాదు, విద్యారంగానికి మానవతా స్పర్శను, అపూర్వ దృష్టికోణాన్ని ఇచ్చిన అరుదైన మానవతామూర్తి'!

కృష్ణ కానూరి, సీనియర్ జర్నలిస్ట్
7981305779

చరిత్ర గమనాన్ని మార్చివేస్తున్న కమ్యూనిస్టులు

ఎం.కోటేశ్వరరావు

అవును ఎవరు అవునన్నా కాదన్నా, మరొకటన్నా ఇది నిజం. సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నట్లుగా మేధావులందరూ పశ్చిమ దేశాలలోనే పుట్టారు, మిగతా దేశాల వారు అక్కడికే వెళతారు అన్నట్లుగా కొందరు చాలాకాలంగా జనాల మెదళ్లకు ఎక్కించారు. ఇప్పుడు చైనా కమ్యూనిస్టులు దాన్ని తలకిందులు చేస్తున్నారు. గత శతాబ్దిలో ప్రపంచాన్ని ఏలిన చమురుకు ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. అయితే అదే సర్వస్వం కాదని తేలిపోయింది. దాన్ని పక్కన పెట్టే " ప్రతిభ " ప్రత్యామ్నాయ హరిత ఇంధనం, క్వాంటమ్, కృత్రిమ మేధ వంటి రూపాల్లో ముందుకు వస్తున్నది. చమురుతో పని లేకుండా నడిచే విద్యుత్ వాహనాలు రోడ్లను ముంచెత్తటం తెలిసిందే. ఈ పూర్వరంగంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో 2035 నాటికి అమెరికాను అధిగమించేందుకు చైనా నడుం కట్టటం గురించి కొద్ది నెలలుగా మీడియాలో విశ్లేషణలు వెలువడుతున్నాయి, అవేవీ కమ్యూనిస్టులు నడిపేవి కాదు, చివరికి కరడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాదుల పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక పత్రిక "స్వరాజ్య "లో 2025 జూన్ 27 న అమిత్ మిశ్రా అనే విశ్లేషకుడు కూడా రాశారు. దాన్ని నవీకరించి ఆగస్టు మూడున తిరిగి ప్రచురించారు. "మేధోవంతుల ఆకర్షణ : వేయి ప్రతిభల చైనా వ్యూహం దాని ఔన్నత్యాన్ని ఎలా ముందుకు నెడుతున్నది " అనే శీర్షిక(కోర్టింగ్ జీనియసెస్ : హౌ చైనా స్ థౌసెండ్ టాలంట్స్ స్ట్రాటజీ ఈస్ ఫ్యూయలింగ్ ఇట్స్ ఎసెంట్) తో ఒక విశ్లేషణ వెలువడింది. ఇక్కడ దీన్ని ప్రస్తావించటం అంటే చైనాకు మిత, మతవాదుల సర్టిఫికెట్ లేదా ప్రశంసల గురించి కాదు. చైనా ఎలా దూసుకుపోతున్నదో చూడండి అనే ఉక్రోషం, అసూయ ప్రదర్శన దాని వెనుక ఉందని చెప్పేందుకే.

ఇక సందర్భానికి వస్తే ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి అంటే విప్లవదినోత్సవం రోజు నుంచి చైనా ప్రభుత్వం ప్రపంచంలోని యువ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు కె వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఎందుకు అంటే 2035 నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాలలో అగ్రగామి దేశంగా మారేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. కొత్తగా పట్టా పుచ్చుకున్న స్వదేశీయులు లేదా విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారు, ఇతర దేశాల్లో ఇప్పటికే ఆయా రంగాలలో పని చేస్తున్న వారిని ఆకర్షించేందుకు పూనుకుంది. ఇటీవలి కాలంలో చైనా విధాన నిర్ణయాలలో ఇది పెద్దదని భావిస్తు న్నారు. తనకు ఎదురులేనంత వరకు చైనాను ఎదగనిచ్చిన అమెరికా ఎప్పుడైతే తన ఆధిపత్యానికి అన్ని రంగాలలో ప్రతి ఘటన ఎదురవుతున్నదని గ్రహించిందో అప్పటి నుంచి అడ్డుకోవటం ప్రారంభించింది. వైట్‌హౌస్‌లో ఏ పార్టీ వారున్నా అదే చేస్తున్న పూర్వరంగంలో దానికి ధీటుగా చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన కసరత్తు నుంచి వెలువడిందే తాజా నిర్ణయం. ప్రధాని లీ క్వియాంగ్ సంతకంతో అది చట్టంగా మారింది. స్టెమ్(సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) రంగాలలో



ప్రతిభావంతులైన విదేశీ యువతను ఆకర్షించేందుకు సరికొత్త " యువ ప్రతిభ " కె వీసా ప్రత్యేకత ఏమంటే చైనాలో ఉన్న కంపెనీల యజమానులు లేదా సంస్థల నుంచి సిఫార్సులు అవసరం లేదు. నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రతిభావంతులైన యువశాస్త్రవేత్తల కార్యక్రమంలో వయస్సు గరిష్ట పరిమితి 45 సంవత్సరాలు, మరో పథకానికి 40 ఏండ్లు. దీనికి ఎలాంటి పరిమితి నిబంధన లేదు. ఇతర దేశాలతో పోటీ పడుతూ వేతనాలు, వసతి, బోనస్, పిల్లలకు విద్య వంటి ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. దేశ విధానానికి లోబడి పరిశోధనలో స్వేచ్ఛ ఉంటుంది. ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడులకు ఎలాంటి రాయితీలు ఇచ్చి ప్రోత్సహించారో ఇప్పుడు ప్రతిభావంతులైన వారిని ఆకర్షించేందుకు అలాంటి విధానాన్నే ముందుకు తెచ్చారని చెప్పవచ్చు. ఇలాంటి ప్రత్యేక వీసాలు అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఎప్పటి నుంచో ఉన్నాయి. అమెరికాలో చైనా సంతతికి చెందిన వారి మీద పెరుగుతున్న జాత్యహంకార వివక్ష, ఆంక్షలు, పరిశోధనలకు కేటాయింపుల కోత, గూఢచర్య ఆరోపణలతో వేధింపులు, రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల పూర్వరంగంలో అనేక మంది అక్కడి నుంచి బయటపడేందుకు చూస్తున్నారు. మంచి పండ్లను ఏరి దిగుమతి చేసుకున్నట్లుగా దశాబ్దాల తరబడి, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మేధో వలసతో ఎంతగానో లబ్ధిపొందాయి. ఇప్పుడు అటునుంచి వలసలకు చైనాతో నాంది పడిందంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది ఒక్క రోజులో జరిగింది కాదు. చైనా కమ్యూనిస్టు పార్టీ నేత లి యువాన్‌చావో 2008 లో "వేయి ప్రతిభావంతుల పథకాని(టిటిపి) కి రూపకల్పన చేశారు. విదేశాల్లో ఉన్న చైనా సంతతికి చెందిన వారిలో కనీసం రెండువేల మందిని స్వదేశానికి ఆహ్వానించి ఒక నవకల్పన సమాజంగా దేశాన్ని మార్చాలని తలపెట్టారు. 2011 ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చినపుడు ఏటా 50 నుంచి వందమందిని పదేండ్ల పాటు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే దానికి మించి ఇప్పటి వరకు ఏడువేల మంది శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, వాణిజ్య, పారిశ్రామికవేత్తలు వచ్చారని అంచనా. వారిలో ఇతర దేశాలకు చెందినవారు కూడా ఉన్నారు. మరొక సమాచారం ప్రకారం 2010 నుంచి 2021 మధ్య కాలంలో కనీసం 20 వేల మంది చైనా జాతీయులు అమెరికా నుంచి స్వదేశానికి వెళ్లారు. ఇలాంటి వారు చూపుతున్న ప్రతిభను బట్టి మిలియన్ల యువాన్లను బోనస్, ఇతర రాయితీలను ప్రతిఫలంగా చెల్లించుతున్నారు. అమెరికా నుంచి వచ్చే వారు విద్రోహ చర్యల నిమిత్తం వస్తున్నారా నిజంగానే పని చేసేందుకేనా అని నిర్ధారించుకొనేందుకు సునిశిత పరిశీలనలు కూడా చేశారని వార్తలు. ఈ పథకానికి చైనా పెద్ద ప్రచారం ఇవ్వలేదు గాని దాని తీరుతెన్నులు గమనించిన అమెరికా జాతీయ గూఢచార సంస్థ, ఎఫ్‌బిఐ గుండెలు బాదుకుంటూ నివేదికలు రూపొందించాయి. చైనా ఆర్థిక, మిలిటరీ రంగాలలో పురోగమించటానికి చట్టబద్దంగా, అక్రమ పద్దతుల్లో అమెరికా మేధో సంపదను చైనా కొల్లగొడుతున్నదని ఆరోపించారు. ఈ ప్రచారం పెరగటంతో చైనా కొత్త పద్దతుల్లో క్విమింగ్ పేరుతో ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పూనుకుంది. 2019 నుంచి 2023 వరకు ఐదు వందలకు పైగా ప్రభుత్వ పత్రాలను పరిశీలించిన రాయిటర్స్ వార్తా సంస్థ చైనా ఇస్తున్న నగదు, ఇతర మొత్తాల గురించి పేర్కొన్నది.

విశాలాంధ్ర
5
ఆదివారం
24 ఆగస్టు 2025

పార్లమెంటు భద్రతకు ఆ చెట్టు ఆటంకం

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఓ చెట్టు... వీవీఐపీల భద్రతకు సవాల్‌గా మారింది. గజ ద్వారం వద్ద ఉన్న ఆ వృక్షంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆ చెట్టును మరో చోటుకు మార్చేందుకు భద్రతా సిబ్బంది సన్నాహాలు ప్రారంభించారు. కొత్త పార్లమెంట్ భవనంలోని ఆరు ప్రవేశ మార్గాల్లో గజ ద్వారం ఒకటి. ప్రధాని నరేంద్రమోదీ తరచూ ఈ మార్గం నుంచే సభకు వెళుతుంటారు. ఈ గేటు వద్ద ఓ పసుపు పూల చెట్టు ఉంది. 'నంబర్ 1'గా పిలిచే ఈ చెట్టు విపరీతంగా పెరిగి ఈ ప్రాంతంలో భద్రతకు అడ్డంకిగా మారింది. వీవీఐపీలు వెళ్లే మార్గంలో ఈ చెట్టు వల్ల భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతుండటంతో... దీన్ని ఇక్కడి నుంచి మార్చాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) భావించింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ)కు వివరించింది. అయితే, ఈ చెట్టును తొలగించాలంటే ఢిల్లీ అటవీ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. దీంతో భద్రతా సిబ్బంది ఆ ప్రక్రియను ప్రారంభించారు. ఇందుకోసం ఇప్పటికే అటవీశాఖ వద్ద రూ.57 వేల సెక్యూరిటీ డిపాజిట్ జమ చేశారు. వచ్చేవారం పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్ వద్దకు దీన్ని మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చెట్టు తరలిస్తున్నందుకు పరిహారంగా సీపీడబ్ల్యూడీ పార్లమెంట్ ప్రాంగణంలోనే మరో 10 మొక్కలు నాటాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు వెల్లడించారు.

భయపడేది లేదు: తేజస్వి

కతిహార్ (బీహార్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి సోషల్ మీడియా పోస్ట్‌పై బీజేపీ పాలిత మహారాష్ట్రలో నమోదయిన ఎఫ్ఐఆర్‌కు తాను భయపడనని, నిజం మాట్లాడుతూనే ఉంటానని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ శనివారం నొక్కి చెప్పారు. బీహార్‌లో ప్రధాని పర్యటన నేపథ్యంలో శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసినందుకు గడ్చిరోలి జిల్లాలో తేజస్విపై కేసు నమోదయింది. అందులో మోదీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు 'జుమ్లా' (వాక్చాతుర్యం) అని ఆయన ఆరోపించారు. పీటీఐ వీడియో వారు వ్యాఖ్యల కోసం సంప్రదించినప్పుడు యువ నాయకుడు తేజస్వి... 'ఎఫ్ఐఆర్‌కి ఎవరు భయపడతారు? జుమ్లా అనేది అభ్యంతరకరమైన పదమా? నేను నిజం చెబుతున్నాను. నేను అలాగే చెబుతూనే ఉంటాను. వారు నాపై ఎన్ని కేసులు పెట్టాలన్నా నమోదు చేయవచ్చు' అని ఎదురు దాడి చేశారు. 'ఓటరు అధికార్ యాత్ర' లో భాగంగా రాష్ట్రంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఉత్తర బీహార్ జిల్లా కతిహార్‌లోని చేపల మార్కెట్‌లు, మఖానా పొలాలను పర్యటిస్తూ బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి అయితే తేజస్వి యాదవ్ మాట్లాడారు. స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ సహా అనేక మంది నాయకుల సమక్షంలో మఖానా (నక్క గింజలు) పండించే మత్స్యకారులతో వారి సమస్యలను వింటూ రాహుల్ గాంధీ కనిపించారు. ఈ రోజు యాత్ర దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న పూర్నియా పట్టణంలో ముగుస్తుంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడంపై తేజస్వి సన్నిహితుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్ బీజేపీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, అసోం వంటి సుదూర రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అర్థం ఏమిటి? బీహార్‌లో కూడా బీజేపీ అధికారం పంచుకుంటుంది. వారికి ధైర్యం ఉంటే, వారు ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేయనివ్వండి. దేశ వ్యాప్తంగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యేల ందరూ మా నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను సవాలు చేస్తున్నాను' అని ఆయన అన్నారు. యాత్రలో పాల్గొంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ ఎంపి అఖిలేశ్ యాదవ్ ఎఫ్ఐఆర్‌ను 'రాజకీయ ప్రతీకార చర్య' గా అభివర్ణించారు. 'మేము భయపడకుండా బ్రిటీషు వారితో పోరాడిన రాజకీయ వంశానికి చెందినవారమని బీజేపీ తెలుసుకోవాలి. మోదీ, అమిత్ షా వంటి వారిచే మేము బెదిరించబడవలసిన వారిం కాదు' అని అన్నారు.

లాయర్ల సమ్మెకు ఎస్‌సీబీఏ మద్దతు

న్యూఢిల్లీ: పోలీసులు పోలీస్ స్టేషన్ల నుంచి కోర్టుల ముందు సాక్ష్యం చెప్పడానికి అనుమతిస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు చేపట్టిన ఆందోళనకు సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) మద్దతు తెలిపింది. పోలీస్ స్టేషన్ల నుంచి వర్చువల్‌గా కోర్టులలో సాక్ష్యాలను సమర్పించడానికి పోలీసులకు అనుమతిస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆగస్టు 13న ఇచ్చిన ఉత్తర్వుపై శుక్రవారం నుంచి న్యాయవాదులు సమ్మె చేస్తున్నారు. 'పోలీసు అధికారుల సాక్ష్యాలను నమోదు చేయడానికి పోలీస్ స్టేషన్లను స్థలాలుగా పేర్కొంటూ ఎల్జీ ఆగస్టు 13న జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఎస్‌సీబీఏ అధ్యక్షుడు, కార్యనిర్వాహక కమిటీ తీవ్రంగా పరిగణించింది' అని శుక్రవారం ఎస్‌సీబీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నోటిఫికేషన్ ఏకపక్షమని, చట్టవిరుద్ధమని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ తీవ్రంగా ఖండించింది. ఎందుకంటే ఇది న్యాయ ప్రక్రియ పవిత్రతను దెబ్బతీయడమే కాకుండా దానిని రాజీ పడేస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ అన్నారు. ఈ నోటిఫికేషన్ న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, న్యాయమైన పరిపాలనను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, విస్తృత ప్రజా ప్రయోజనాలకు అనుకూలంగా లేదని ఎస్‌సీబీఏ విశ్వసిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ప్రజ్ఞా బాఘేల్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 'దీని ప్రకారం, ఎస్‌సీబీఏ ఆ నోటిఫికేషన్‌ను తీవ్రంగా ఖండించాలని నిర్ణయించుకుంది. న్యాయం, చట్ట పాలన ప్రయోజనాల దృష్ట్యా నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సంబంధిత అధికారులను కోరుతోంది' అని తెలిపింది. ఈ నోటిఫికేషన్‌కు నిరసనగా అన్ని ఢిల్లీ బార్ అసోసియేషన్లు ఆగస్టు 22, 23 తేదీలలో పనికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. సమ్మె శనివారం కూడా కొనసాగిందని కమిటీ అదనపు సెక్రటరీ జనరల్ తరుణ్ రాణా తెలిపారు.

టెంపోను ఢీ కొట్టిన ట్రక్కు... ఎనిమిది మంది మృతి

పట్నా: బీహార్ రాజధాని పట్నాలో టెంపోను ట్రక్కు బలంగా ఢీ కొట్టడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గాయపడ్డారు. పట్నాలోని షాజహాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నలంద జిల్లాకు చెందిన కొందరు భక్తులు గంగా నదిలో స్నానం అనంతరం ఫత్వా నుంచి స్వగ్రామానికి టెంపో వాహనంలో బయల్దేరారు. అయితే వీరు ప్రయాణిస్తున్న టెంపోను అతివేగంగా వచ్చిన ఓ ట్రక్కు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో టెంపో పూర్తిగా ముక్కలైపోయింది. ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు నలుగురు గాయపడ్డారు.

రూ.20 వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలా?

సర్వీస్ చార్జీలపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార బిల్లులలో సర్వీస్ చార్జీలు కలిపి తీసుకోవడంపై ఢిల్లీ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధర వసూలు చేస్తున్నప్పుడు... మళ్లీ వినియోగదారులపై సర్వీసు చార్జీల మోత ఎందుకని ప్రశ్నించింది. హోటళ్లు, రెస్టారెంట్లలో సర్వీస్ చార్జీలు తప్పనిసరి కాదంటూ ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. దీన్ని సవాల్ చేస్తూ నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్... హోటళ్లు, రెస్టారెంట్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 'రెస్టారెంట్లు తమ వద్దకు వచ్చే వినియోగదారుల నుంచి మూడు విధాలుగా చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఆహార పదార్థాలు విక్రయించడం, వాటిని సరఫరా చేయడం, ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్నందుకు చార్జీలు విధిస్తున్నాయి. ఇప్పటికే మీరు (రెస్టారెంట్లు) ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్నామన్న కారణంతో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. అలాంటప్పుడు మళ్లీ సేవల కోసం సర్వీస్ చార్జీలు ఎలా తీసుకుంటారు? ఉదాహరణకు రూ.20 వాటర్ బాటిల్ ధర రెస్టారెంట్లలో రూ.100 వసూలు చేస్తున్నారు. అప్పుడు కస్టమర్ మళ్లీ ఎందుకు సర్వీస్ చార్జ్ చెల్లించాలి? రూ.20 ధర ఉన్న వాటర్ బాటిల్‌ను మెనూలో రూ.100గా పేర్కొన్నప్పుడు అదనంగా వసూలు చేస్తున్న రూ.80 ఎందుకో చెబుతున్నారా?' అని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. హోటళ్లు, రెస్టారెంట్లు బిల్లులలో సర్వీస్ చార్జీలు వసూలు చేయడాన్ని నిషేధిస్తూ వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ గతంలో చేసిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ పలు రెస్టారెంట్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లను మార్చిలో కోర్టు కొట్టేసింది.

ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫ్రీ

ముంబై: రాష్ట్రంలో టోల్‌ప్లాజాల వద్ద ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఐకానిక్ అటల్ సేతు, ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్ సహా కీలక రహదారులపై ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఇది ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ తెలిపారు. ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్లు, ఈ-బస్సులకు టోల్ టాక్స్ ఫ్రీ విధానం వర్తించనున్నట్లు పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ విధానం వల్ల అధికశాతం మంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతారని, తద్వారా కాలుష్యం నుంచి బయటపడొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

అసమ్మతి... విభేదాలు

- మోదీ హయాంలో ఆరుగురి రాజీనామా
- రఘురాం రాజన్, ఉర్జిత్ పటేల్...

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వ ఎన్డీయే అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో కీలక అధికారులు కొందరు అస్మమతి, విభేదాల కారణంగా రాజీనామాలు చేశారు. ఇటీవల ఉప రాష్ట్రపతిగా పదవీ కాలం పూర్తి కాకుండానే జగదీప్ ధన్కర్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అంతకుముందు టెక్నోక్రాట్లు, విధానాల రూపకర్తలు కూడా మోదీకి, ఆయన ప్రభుత్వానికి దూరమయ్యారు. ఆకస్మికంగా రాజీనామా చేసిన వారిలో ఆర్బీఐ మాజీ గవర్నర్లు రఘురాం రాజన్ (2013-16), ఉర్జిత్ పటేల్ (2016-18), ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య (2017-19), ప్రధాన ఆర్థిక సలహాదారుడు అరవింద్ సుబ్రమణియన్ (2014-18), ఎన్నికల కమిషనర్లు అశోక్ లవాసా (2018-20), అరుణ్ గోయల్ (2022-24) ఉన్నారు.

ఆర్థికవేత్త, విద్యావేత్త రఘురాం రాజన్‌ను యూపీఏ-2 పాలన చివరి సంవత్సరంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎంపిక చేశారు. రాజన్ రెండవసారి పదవీ బాధ్యతలు చేపట్టేందుకు నిరాకరించారు. చికాగో యూనివర్సిటీలో బోధన వృత్తిని ఎంచుకున్నారు. 2008లో ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అంచనా వేశారు. మోదీ మొదటిసారి పగ్గాలు చేపట్టినప్పుడు ఆయన ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలపై తన అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తంచేశారు. ఇది మోదీ సర్కారుకు నచ్చలేదు. నోట్ల రద్దు, ఎన్నికల బాండ్లపై రాజన్‌కు, మోదీ ప్రభుత్వానికి ఏకాభిప్రాయం కుదరలేదు. అప్పట్లో కేంద్ర వాణిజ్య మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ బహిరంగంగానే రాజన్‌ను విమర్శించారు. పదవీ బాధ్యతల నుంచి తప్పుకున్న దాదాపు ఏడాదిన్నర తర్వాత నోట్ల రద్దును వ్యతిరేకించినట్లు రాజన్ బహిర్గతం చేశారు. ఆయన రాజీనామా చేసిన రెండు నెలలకు నోట్ల రద్దు జరిగింది. ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ 2018 డిసెంబరులో ఆర్బీఐ బోర్డు కీలక సమావేశానికి ముందు రాజీనామా ప్రకటించారు. పదవీ కాలం పూర్తి కాకుండానే వ్యక్తిగత కారణాలతో తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. రాజన్ తర్వాత ఆర్బీఐ పగ్గాలు చేపట్టిన ఆయన నోట్ల రద్దు నేపథ్యంలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. మోదీ సర్కారుకు సంబంధించిన అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. పటేల్ నిష్క్రమణ ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడం కోసం 48.73 బిలియన్ డాలర్లు అంటే రూ.3.6 ట్రిలియన్లు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో వచ్చిన విభేదాలు కూడా పటేల్ రాజీనామాకు కారణంగా చెప్పవచ్చు. నిల్వల నుంచి రూ.3లక్షల కోట్లు ఇచ్చేలా ఆర్బీఐని బలవంతం చేసేందుకు ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 7ను రద్దు చేస్తామని ప్రభుత్వం బెదిరించింది. నోట్ల రద్దు వల్ల వచ్చిన డివిడెండ్ నష్టాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించింది. వడ్డీ రేట్ల విధానాలపై పటేల్‌తో విభేదాలు వచ్చాయి. ఎన్నికల బాండ్ల కోసం మోదీ ప్రభుత్వంతో ఆయనకు ఏకాభిప్రాయం కుదరలేదు. కేవైసీ తర్వాత ఫిజికల్ బాండ్లు కాకుండా డిజిటల్ మోడ్‌లో ఎన్నికల బాండ్లు జారీ చేయాలని పటేల్ సూచించారు. బ్యాంకుకు వెళ్లి పార్టీలు వాటిని సేకరించేలా తుది ప్రతిపాదన చేశారు. అయితే విభేదాల కారణంగానే పటేల్ రాజీనామా చేసినట్లు రాజన్ కూడా చెప్పారు.

ఆర్బీఐ సార్వభౌమాధికారానికి హామీ ఉండాలని, అందుకు భంగం కలిగిస్తే విపత్తు తప్పదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ వైరల్ ఆచార్య మాట్లాడటం 2018 అక్టోబరులో పతాకశీర్షికల్లో నిలిచింది. ఉర్జిత్ పటేల్ రాజీనామాకు దారితీసిన ఆర్బీఐ-సర్కారు మధ్య విభేదాల వేళ ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ సమావేశానికి కొన్ని వారాల ముందు రాజీనామా పత్రాలను ఆచార్య సమర్పించారు. మోదీ ప్రభుత్వ ఆర్థిక లోటు అంచనాల విధానం, ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలపై అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్‌తో ఆయనకు విభేదాలు వచ్చాయి. వ్యక్తిగత కారణాలతో పదవీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆచార్య ప్రకటించారు.

అరవింద్ సుబ్రమణియన్ ప్రధాన ఆర్థిక సలహాదారుడు. 2018లో తన కుటుంబంతో కలిసివుండేందుకు అమెరికా వెళ్లేందుకు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. 2014 అక్టోబరులో నియమితులైన ఆయన అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాజీనామా గురించి చెప్పగా ఆయన ఉండమని కోరారు. కానీ అరవింద్ వినలేదు. ఎయిరిండియా సహా సంస్థల ప్రైవేటీకరణకు మద్దతు ఇవ్వడంతో ఆర్ఎస్ఎస్ అనుబంధ స్వదేశీ జాగరణ్ మంచ్‌తో పాటు బీజేపీ నేత సుబ్రమణ్యం స్వామి నుంచి విమర్శలను అరవింద్ ఎదుర్కొన్నారు. మేధో సంపతి హక్కులపై అమెరికాకు మద్దతిచ్చిన కారణంగా స్వామి ఆయనను విమర్శించారు. దీంతో జైట్లీ స్వయంగా జోక్యం చేసుకొని వివాదానికి తెరదించారు. అరవింద్ తన నిష్క్రమణ తర్వాత ప్రభుత్వంపై విమర్శలను కొనసాగించారు. జనవరిలో సీనియర్ జర్నలిస్టు కరణ్ థాపర్‌తో మాట్లాడుతూ దేశ ఆర్థిక స్థితి బాగోలేదని అరవింద్ చెప్పారు.

2024 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు కేవలం కొన్ని రోజుల ముందు ఎన్నికల కమిషనర్లు అరుణ్ గోయల్, అశోక్ లవాసా రాజీనామా చేశారు. గోయల్ నిష్క్రమణతో కేంద్ర ఎన్నికల ప్యానెల్‌లో అప్పటి సీఈసీ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష కోసం బెంగాల్ వెళ్లాల్సిన ముందు రోజు గోయల్ ఎందుకు రాజీనామా చేయడం నేటికీ వీడని చిక్కుముడిగా ఉంది. ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసివుంటే ప్రస్తుతం జ్ఞానేశ్ కుమార్ స్థానంలో సీఈసీగా ఉండేవారు. 2019 లోక్‌సభ ఎన్నికలప్పుడు ప్రచారానికి సంబంధించి మోదీ ఉల్లంఘనలపై అశోక్ లావాసా అనేకసార్లు అసహనం వ్యక్తంచేశారు. విభేదాలతోనే పదవీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఆయన ఐదుగురు కుటుంబ సభ్యులపై ఐటీ దాడులు జరిగాయి. పెగాసస్ స్పైవేర్ దాడి జరిగిన వారిలో అశోక్ లావాసా ఉన్నారు.

అంబానీ కంపెనీల్లో సీబీఐ తనిఖీలు

ముంబై: ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు, ఇతర ప్రాంతాల్లో సీబీఐ శనివారం తనిఖీలు చేపట్టింది. అనిల్ గ్రూప్ కంపెనీలు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అవకతవకలకు పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. దాంతో ఇప్పటికే ఆయన కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రెండు వారాల క్రితం ఆయన్ను 10 గంటల పాటు ఈడీ ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. కాగా ఎస్‌బీఐని రూ.2వేల కోట్ల మేర మోసం చేశారన్న కేసులో తాజాగా సీబీఐ సోదాలు నిర్వహించింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్‌బీఐ నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను 'మోసపూరితమైంద'ని వర్గీకరించాక, ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్‌బీఐకి తెలపాలి. కేసును సీబీఐ/పోలీసులకు నివేదించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఇక ఈడీ ప్రాథమిక నివేదిక ప్రకారం.. 2017 నుంచి 2019 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాలను అనిల్ అంబానీ కంపెనీలు అనుమానాస్పద రీతిలో దారి మళ్లించాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ అంశంలో యస్ బ్యాంక్ మాజీ ఎండీ ప్రమోటర్ రాణా కపూర్‌పై దాఖలైన మనీలాండరింగ్ కేసులో భాగంగా 2020లో అనిల్ అంబానీ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. అదేతరహాలో మరో రూ.14వేల కోట్లు ఇతర బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు అధికారులు చెబుతున్నారు.

వృత్తి నిబద్ధతతోనే విజయం

సీజేఐ గవాయ్

పనాజీ: వృత్తి జీవితంలో విజయం స్థాయి పరీక్షా ఫలితాల ద్వారా కాకుండా దృఢ సంకల్పం, కృషి, అంకితభావం, పని పట్ల నిబద్ధత ద్వారా నిర్ణయించబడుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్ శనివారం అన్నారు. పనాజీ సమీపంలోని మిరామార్‌లోని వి.ఎం.సల్గావ్కర్ న్యాయ కళాశాల స్వర్ణోత్సవంలో సీజేఐ గవాయ్ మాట్లాడుతూ న్యాయ విద్యా వ్యవస్థ ఒక నమూనా మార్పు తీసుకుందని అన్నారు. 'పరీక్షల్లో మీ ర్యాంకుల ఆధారంగా ఆలోచించవద్దు. ఎందుకంటే ఈ ఫలితాలు మీరు ఏ స్థాయి విజయానికి దారితీస్తారో నిర్ణయించవు. మీ సంకల్పం, కృషి, అంకితభావం, వృత్తి పట్ల నిబద్ధత అన్నీ ముఖ్యమైనవి' అని ఆయన న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. తాను తెలివైన విద్యార్థినని, అయితే తరగతులు ఎగ్గొట్టేవాడినని గుర్తు చేసుకున్నాడు. ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో చదువుతున్నప్పుడు తరగతులు ఎగ్గొట్టి కళాశాల కాంపౌండ్ గోడపై కూర్చునేవాడినని చెప్పారు. 'న్యాయ డిగ్రీ చివరి సంవత్సరంలో నా తండ్రి (మహారాష్ట్ర) శాసన మండలికి చైర్మన్‌గా ఉన్నందున నేను అమరావతికి మారాల్సి వచ్చింది. ముంబైలో మాకు ఇల్లు లేదు. నేను అమరావతిలో ఉన్నప్పుడు దాదాపు అర డజను సార్లు మాత్రమే కళాశాలకు వెళ్లి ఉండేవాడిని. తరువాత హైకోర్టు న్యాయమూర్తి అయిన నా స్నేహితుల్లో ఒకరు నా ఉనికిని గుర్తించేవారు' అని సీజేఐ అన్నారు. 'కానీ మమ్మల్ని అనుకరించడానికి ప్రయత్నించవద్దు' అని ఆయన సూచించారు. న్యాయ సహాయం ప్రయోజనాలు దేశంలోని మారుమూల ప్రాంతాలకు చేరాలని సీజేఐ గవాయ్ అన్నారు.

అంతరిక్ష రహస్యాలు ఛేదించండి

- ఏడాదికి 50 రాకెట్ ప్రయోగాలు
- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: రోదసి అన్వేషణ చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను ఛేదించాలని ఆయన కోరారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శనివారం ప్రధాని మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను పోస్టు చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాల కోసం వ్యోమగాముల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యువత దీనిలో భాగం కావాలన్నారు. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న గెలాక్సీలు, అంతరిక్షంపై అధ్యయనం చేయాలన్నారు. చంద్రుడి మీదకు, మార్స్ మీదకు వెళ్లామని, డీప్ స్పేస్ అంశంలో మరింత లోతుగా అన్వేషణ చేపట్టాలని, మానవాళికి ఉపయోగపడే అనేక రహస్యాలు అక్కడ ఉంటాయన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ ఒక్కొక్క మైలురాయి అందుకోవడం దేశానికి గర్వకారణమన్నారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా.. అంతరిక్ష రంగంతో సంబంధం ఉన్న శాస్త్రవేత్తలు, యువతకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సెమీ క్రయోజనిక్ ఇంజిన్లు, ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ లాంటి టెక్నాలజీ సంబంధిత అంశాల్లో భారత్ అత్యాధునికంగా దూసుకెళ్తోందన్నారు. భారత్ త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభిస్తుందని... రాబోయే రోజుల్లో స్వంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తుందని ప్రధాని చెప్పారు. భారత పరిపాలనా వ్యవస్థలో స్పేస్ టెక్నాలజీ అధిక భాగంగా మారిందన్నారు. పంట బీమా పథకాలు, మత్స్యకారుల రక్షణ, విపత్తు సహాయక చర్యలన్నీ ఇప్పుడు శాటిలైట్ ఆధారితంగా జరుగుతున్నట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి.. దేశ సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అలాగే భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాలని, రాబోయే ఐదేళ్లలో కనీసం ఐదు యూనికార్న్‌లను సృష్టించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏడాదికి ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాల సంఖ్యను 50కి పెంచే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. అంతరిక్ష రంగంలో నూతన తరం సంస్కరణలను కొనసాగించేందుకు ప్రభుత్వానికి సంకల్పం ఉందని చెబుతూ, యువతకు అపార అవకాశాలు కల్పించే ఈ రంగం వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రైవేట్ సంస్థలను ప్రధాని ఆహ్వానించారు.

'ధర్మస్థల' కేసు...ముసుగు వ్యక్తి అరెస్టు

బెంగళూరు: కర్నాటకలోని ధర్మస్థలలో వందల మృతదేహాల ఖననం ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ మృతదేహాలను తానే పూడ్చిపెట్టానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు, ముసుగు వ్యక్తి భీమాను తాజాగా సిట్ అధికారులు అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. ధర్మస్థల పరిసరాల్లో 100కు పైగా శవాలు పూడ్చిపెట్టానని చెప్పిన భీమా చివరకు వాటి ఆనవాళ్లు చూపకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది.

ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి

- భారీవర్షాలకు ఊరు ఊరే కొట్టుకుపోయిన వైనం
- గ్రామాన్ని కమ్మేసిన బురద, రాళ్లు
- అనేకమంది గల్లంతు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. మునుపెన్నడూ లేనిరీతిలో సంభవించిన వర్షాలు, వరదలకు ఏకంగా ఊరు ఊరే కొట్టుకుపోయిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం (ఆగస్టు 22) అర్ధరాత్రి ప్రాంతంలో వచ్చిన వానలకు కొండచరియలు కూలిపోయాయి. పెద్దపెద్ద రాళ్లు, భారీగా బురద కొట్టుకొచ్చి గ్రామాన్ని కమ్మేసింది. భారీ వరదకు ఏకంగా ఊరు ఊరే కొట్టుకోపోయింది. ఇప్పుడు అక్కడ కూలిన శిథిలాలు తప్ప చెప్పుకోవడానికి ఏమీ మిగలని పరిస్థితి. చమోలి జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలు చాలా గ్రామాలను అల్లకల్లోలం చేశాయి. గ్రామాల్లో ఇళ్లన్నీ నేలమట్టం అయ్యాయి. తరలీ మార్కెట్, కోట్ దీప్, తరలీ మండల కార్యాలయం అన్నీ ధ్వంసం అయ్యాయి. చాలా మంది ప్రజలు వరదలో కొట్టుకుపోయినట్లు చెబుతున్నారు. భారీగా వచ్చిన వరద కారణంగా కార్లు, బైకులు కొట్టుకుపోగా.. చాలా వరకు పనికిరాకుండా పోయాయి. సగ్వారా గ్రామంలో 20 ఏళ్ల యువతి బురదలో సమాధి అయ్యిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మొత్తం పది నుంచి 12 ఇళ్లు బురదలో కూరుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. చెడ్పాన్ మార్కెట్ ఏరియాలో మరో వ్యక్తి గల్లంతైనట్లు పోలీసు అధికారులు తెలిపారు. తున్రీ గధేరా లో భారీ వరదల కారణంగా ఇళ్లు కొట్టుకుపోయి పిండార్ నది వరకు శిథిలాలు చేరుకున్నాయని తెలిపారు. తరలీ ఏరియాను అనుసంధానం చేసే కర్ణప్రయాగ్-గ్వాల్దాం జాతీయ రహదారి మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. అదే విధంగా తరలీ-సగ్వారా, డుంగ్రీ రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీ వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టినప్పటికీ కొట్టుకుపోయిన వారి ఆచూకీ ఇప్పటికీ దొరకలేదని చెబుతున్నారు స్థానికులు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరకేంద్రం హెచ్చరించింది. డెహ్రాడూన్, చమోలీ, రుద్రప్రయాగ్, ఆల్మోరా, నైనిటాల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

సీఎం ధామి స్పందన

"చమోలీ జిల్లాలోని థరాలి ప్రాంతంలో క్లౌడ్‌బరస్ట్ సంభవించిందనే విషాదకర వార్త అందింది. జిల్లా యంత్రాంగం, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయ, సహాయ చర్యలలో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయంలో నేను స్థానిక పరిపాలనతో నిరంతరం సంప్రదిస్తూ పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నాను. అందరి భద్రత కోసం నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. ప్రజలంతా సురక్షితంగా ఉండాలి" అని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి ఎక్స్ వేదికగా తెలిపారు. ఉత్తరాఖండ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటికే వర్షాల కారణంగా సంభవించిన విపత్తు వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది మంది ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక అనుసంధాన రహదారులు మూసుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జార్ఖండ్‌లో ఐదుగురి మృతి

జార్ఖండ్‌లో కురిసిన భారీ వర్షాలకు వివిధ ప్రాంతాల్లో ఐదుగురు మృతి చెందగా... ఒకరు గల్లంతయ్యారని, చాలామంది గాయపడ్డారని శనివారం అధికారులు తెలిపారు. సెరైకెల్లా ఖర్సవాన్ జిల్లాలో వర్షానికి ఇల్లు కూలి ఓ మహిళ, ఆమె కుమారుడు మృతి చెందారు. రాజ్‌నగర్ బ్లాక్‌లోని దండు గ్రామంలో జరిగిన మరో ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరో ఘటనలో ఇల్లు కూలి మహిళ, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడడంతో... వారిని జంషెడ్‌పూర్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిద్దరూ చికిత్స పొందుతూ మృతి చెందారు. సంతోష్ లాహోర్ కుచ్చా ఇల్లు కూలిపోవడంతో మరో ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు మీడియాకు వెల్లడించారు. ఖరస్వాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కోల్ షిమ్లాలో ఇల్లు కూలి ఓ ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ఘటన శనివారం ఉదయం జరిగినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఛత్రా జిల్లాలో ఉప్పొంగుతున్న నదిలో కొంతమంది కొట్టుకుపోయారు. ఈ ఘటన కట్బరా గ్రామంలో జరిగింది. ఈ ఘటనలో భర్త మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోగా... భార్య గల్లంతైనట్లు గిధౌర్ బీడీఓ రాహుల్ దేవ్ మీడియాకు వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మట్టి గణపతులను మాత్రమే పూజించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 27 నుండి ప్రారంభమయ్యే గణేష్ చతుర్థి వేడుకల సందర్భంగా పర్యావరణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రజలు మట్టి గణపతులను మాత్రమే పూజించా లని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నుండి మట్టి విగ్రహాలకు మారాలని ఆమె ప్రజలను గట్టిగా కోరారు. "మట్టి గణేష్ విగ్రహాలను తయారు చేసి ఇంటిలో మన నివాస ప్రాంతాలలో మట్టి గణేష్ విగ్రహాలకు పూజలు చేద్దామన్నారు. నీటి వనరులలో నుండి మట్టిని ఉపయోగించి మట్టి విగ్రహాలను తయారు చేసి పూజ చేసిన తర్వాత నీటి వనరులలోవాటిని తిరిగి నిమజ్జనం చేయలని" తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) మట్టి గణేష్ విగ్రహాలపై ప్రచార పోస్టర్లను శనివారం సచివాలయంలో విడుదల చేస్తూ మంత్రి సురేఖ అన్నారు. పూజలలో ఉపయోగించే పూలు, మూలికలను కంపోస్ట్ చేయాలని బయోడిగ్రే డబుల్ కాని పదార్థాలను నీటి వనరులలో వేయకూడదని ఆమె ప్రజలను కోరారు. 2025 గణేష్ చతుర్థికి సంబంధించి టిజిపిసిబి మట్టి గణేశ విగ్రహాల ప్రచారం కోసం పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ కేంద్రాలు నిర్వహించడం, ఆటోలపై పోస్టర్లను ప్రదర్శించడం, దేవాలయాలలో ప్రదర్శనలు, జిహెచ్ఎంసి ప్రాంతం, జిల్లాల్లో 3.24 లక్షలుకు పైగా మట్టి విగ్రహాల పంపిణీ వంటి అనేక పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేపడు తోంది. టిజిపిసిబి సభ్య కార్యదర్శి జి.రవి, చీఫ్ ఇంజనీర్ బి.రఘు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సిపిఐ అగ్ర నాయకులు ఎర్రజెండ ముద్దుబిడ్డ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉత్తమ పార్లమెంటేరియన్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరనిలోటని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ అన్నారు. వినాయక్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ ఆయన జీవితమంతా రైతులు కూలీలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం ఆయన అంకితమయ్యా రని, ఆయన బాటలో మనం నడిచినప్పుడే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించిన వాళ్ళమవుతామని, ఏ.ఐ.ఎస్.ఎఫ్. విద్యార్థి దశ నుండి అణగారిన ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, బి.యాదగిరి, జే. రాములు, ఆర్.గిరిజ, ఎం.లింగం, కే.ప్రభాకర్, పి.సత్యనారాయణ, ఎస్.కె అజీజ్, సయ్యద్ యూసుఫ్, సి.కృష్ణ, ఎస్.కాసిం తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళాకారుడు సి వెంకటాచారి సుధాకర్ రెడ్డి పైన పాట పాడి నివాళులర్పించారు.

సామాజిక సమస్యలే రచనలకు ఇతివృత్తాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మన చుట్టూ ఉన్న సమాజం, మనుషుల స్వభావాలు, సంబంధాలు, లుప్తమైపోతున్న మానవ విలువలు, సామాజిక సమస్యలు, అంతర్ బహిర్ సంఘర్షణలు నా కవిత్వా నికి, కథలకు, నవలలకు ఇతివృత్తాలు' అన్నారు. సుప్రసిద్ధ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సయ్యద్ సలీం. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో 'రచయిత సయ్యద్ సలీంతో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది. సలీం మాట్లాడుతూ నా జీవితంలో ఆకలి, అవమానాలు నేర్పిన పాఠాలే నా సాహితీ సృజనకు పునాదులుగా మారాయి. ఓ కుగ్రామంలో నిరుపేద, నిరక్షరాస్యులైన ముస్లిం దంపతులకు పుట్టిన నేను ఈస్థాయికి చేరుకోడానికి చాలా పోరాటాలే చేశాను. చదువులో పీజీ వరకు ఎప్పుడూ ప్రథమస్థానంలో నిలబడిన నాకు మంచి ఉద్యోగం దొరకడం, డాక్టర్ గీతా నాగరాణితో వివాహం తర్వాత జీవితం ఓ అందమైన మలుపు తిరిగింది. ఇప్పటివరకు మూడు కవితా సంపుటాలు, పన్నెండు కథా సంపుటాలు, ముప్ఫయ్ యేడు నవలలు వెలువరించాను. వీటిలో పిల్లల కోసం రాసిన ఆరు సైన్స్ ఫిక్షన్ నవలికలు కూడా ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళం, మళయాళం, మరాఠీ, ఒరియా భాషల్లోకి 69 పుస్తకాలు అనువాదమయ్యాయి. కార్పొరేట్ విద్యా వ్యవస్థ, కార్పొరేట్ ఆస్పత్రులు, మెర్సీ కిల్లింగ్, చెంచుల జీవితాలు, ఎరుకల బతుకులు, ముస్లిం స్త్రీల వ్యథలు, దూదేకుల పరాయీకరణ, శారీరక వైకల్యంతో బాధపడే వ్యక్తుల మనోవేదన, దేశ విభజన తర్వాత సరిహద్దు గ్రామాల్లోని ప్రజల వెతలు వంటి విశిష్ట, విభిన్న కథాంశాలతో నవలలు రాసానన్నారు. సభాప్రారంభంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రచయితను సభికులకు పరిచయం చేసి, సభను నిర్వహించారు. సభలో ప్రొఫెసర్ సి. మృణాలిని, ప్రొఫె సర్ కరిమిండ్ల లావణ్య, డా. నాళేశ్వరం శంకరం, డా.ఎస్.రఘు పాల్గొన్నారు.

హైదరాబాద్ డివిజన్‌లో దక్షిణ రైల్వే జీఎం తనిఖీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం ముద్ఖేడ్ -సికింద్రాబాద్ సెక్షన్‌లో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా జీఎంతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ, ఇతర సీనియర్ అధికారులూ ఉన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముద్ఖేడ్ - సికింద్రాబాద్ సెక్షన్‌లో రియర్ విండో ఇన్స్పెక్షన్ చేసి, రైలు పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, వంతెనలు, కీలక రైల్వే స్టేషన్ల భద్రతా అంశాలను సమీక్షించారు. జీఎం బసర రైల్వే స్టేషన్‌లో పలు సౌకర్యాలు, బాహ్య ప్రదేశాల ఏరియాను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని జీఎం సమీక్షించారు. అనంతరం, నిజామాబాద్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన జీఎం, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పునర్వ్యవస్థీకరణ పనుల పురోగతిని పరిశీలించి, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, స్టేషన్ వెలుపల సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించారు. అలాగే ఉదయం సమయంలో జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ నాందేడ్ - ముద్ఖేడ్ సెక్షన్‌లో రియర్ విండో ఇన్స్పెక్షన్ నిర్వహించి రైలు పట్టాల భద్రతా అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్ లక్ష్మణరావు కమ్లే పాల్గొన్నారు. అనంతరం జీఎం నాందేడ్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, స్టేషన్‌లో లభ్యమయ్యే సదుపాయాలను పరిశీలించారు. అనంతరం డీఆర్ఎంతో పాటు ఇతర సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, డివిజన్ చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పర్యటనలో భాగంగా జీఎం వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కూలీలను కలసి వారి సమస్యలు వినిపించుకున్నారు.

యూరియాపై ఆందోళన వద్దు : మంత్రులు

సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్‌లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపార వేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్‌సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్‌కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ పాల్గొన్నారు.

బడిగా మారిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బడిగా మారింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని 27 ప్రభుత్వం ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి, మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతశాతం అనే కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణ, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సహకారంతో ఈనెల 23, 24 తేదిలలో విద్యార్థులకు క్యాంపు కార్యాలయంలో ప్రేరణా తరగతులను అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందంచే నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రేరణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు తమతమ పాఠశాలలో లిటిల్ టీచర్స్‌గా పనిచేస్తారని వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు అనిల్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మొత్తం 277 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు రవీందర్, మహేందర్ రెడ్డి, వెంకటేష్, మహబూబ్ నగర్ ఫస్ట్ సభ్యులు రాధిక, మౌనిక, నిఖత్, సమాన్, 27 వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం : మల్లు నర్సింహ్మారెడ్డి

పేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ గ్రామీణ మండలానికి చెందిన పలువురికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేదవారి ఆరోగ్యాన్ని కాపాడేది ప్రజా ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక పోయినా, ప్రజలకు ఇచ్చే ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపు చేయడం లేదన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, నాయకులు గోవింద్ యాదవ్, సుధాకర్ రెడ్డి, ఖాజా, రాజు గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

జానపదులే ప్రజా కళలకు జీవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తరాలుగా ప్రజల ఆచార సాంప్రదాయాలలో భాగమైన ప్రజా కలలకు జీవం పోసింది జానపదలే అని ప్రముఖ గాయనీ నంచర్ల గురుకుల సంగీత ఉపాధ్యాయుని శ్యామల అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం మహ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల సోసైటి విద్యాలయంలో జానపద సంగీత ఉపాధ్యాయురాలు శ్యామల నేతృత్వంలో ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వారోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా కళాకారులైన విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించి, జానపద కళా రంగంలో అశువులు బాసిన అమర కళాకారులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభ నిర్వహించి, వివిధ కళా రూపాలు ప్రదర్శించారు. జానపద సంగీత ఉపాధ్యాయురాలు శ్యామల సౌజన్యంతో కళా రంగంలో ప్రతిభ కనపరిచిన గురుకుల పాఠశాల విద్యార్థినీలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సాంఘిక అసమానతలపై, అంధ మూఢత్వాలపై, అంటరానితనం అస్పృశ్యతల, బాల్య వివాహాల నిర్మూలన, అబలకు విద్యపై జానపద కళారూపాలే చైతన్య చోదకులుగా కవాతు చేశాయని అన్నారు. గ్రామీణ ప్రాంత శ్రమజీవుల నాలుకలపై స్వచ్ఛమైన జానపదాలు నాట్యం చేస్తాయని అన్నారు. నేటి పాశ్చాత్య విష సాంస్కృతి వింత పోకడలతో జానపద కళారంగం పెనుసవాళ్ళను ఎదుర్కొంటుందని అన్నారు. శ్రమలో నుంచి పుట్టిందే జానపదం అని జానపదాలకు మౌఖిక ఆధారాలు ప్రజలలో మిళీతమైన ఆటపాటలేనని అన్నారు. ఆధునిక కళా రంగంలో గ్రామీణ ప్రాంతాల్లో యక్షగానం, బుర్రకథ, హరికథ, పల్లె సుద్దులు, చెక్కభజన లాంటి కళలు సాహిత్యం విధ్వంసం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద కళారంగం స్వాతంత్ర సంగ్రామంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం క్రియాశీలక పాత్ర పోషించి దొర గడిలను కూల్చిందని అన్నారు. నేటి సోషల్ మీడియా స్వార్థంతో ఆధునిక జానపదం అంటూ బూతు సాహిత్యం, పాటలతో జానపద ఔనత్యాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు. ఆహ్లాదానికి ఆరోగ్యానికి జానపద పాటలు ఎంతో ప్రసిద్ధి అని అన్నారు. జానపద సంపదను విశిష్టతను కాపాడేందుకు ప్రత్యేక కృషి జరగాలని విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అరుణ ప్రసంగిస్తూ విద్యార్థినిలు చదువుతో పాటు పాట పాటల్లో ప్రతిభ చాటాలని అప్పుడే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలిక్కి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం సుజాత, లక్ష్మి, ఫాతిమా, ప్రజ్ఞ, అమృత, లావణ్య, శ్రీదేవి, విద్యార్థిని కళాకారులు శివరాణి, స్వాతి, మౌనిక, అక్షయ, సరస్వతి కావేరి తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర - కాప్రా : సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటేరియన్ సురవరం సుధాకరరెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ అన్నారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్. బోస్‌లి. మాట్లాడుతూ సురవరం ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు ముగిసిన కొద్ది నిమిషాలకే తమ ఆత్మీయ నేత సురవరం మరణించిన వార్త తెలియడంతో సిపిఐ నాయకులు, పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి 1942, మార్చి 25న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాన్‌రేవ్‌పల్లిలో జన్మించారు. ఆయన తండ్రి వెంకట్‌రామ్‌రెడ్డి. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి స్వయాన సుధాకర్‌రెడ్డికి పెదనాన్న అవుతారన్నారు. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా, అనంతరం కాలంలో ఎస్ఎఫ్, వైఎఫ్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీలో ఉంటూ దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాల వ్యాప్తికి విశేష కృషి చేశారు. 2008 నుండి సిపిఐ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పనిచేసిన తదుపరి 2012లో పాట్నాలో పార్టీ 21వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. పుదుచ్చేరి (2015), కొల్లాం (2018) మహాసభలో తిరిగి ఎన్నుకోబడిన సుధాకరరెడ్డి 2019 జులై 24న పార్టీ జాతీయ సమితి సమావేశంలో ఆరోగ్య కారణాలతో రిలీవ్ అయ్యారన్నారు. సురవరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సీపీఐ పార్టీ తరపున తెలియజేస్తున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ సభ్యులు జీ. లక్ష్మీ నారాయణ, మిరియాల సాయిలు, శ్రీనివాస్, స్వామిదాస్, రాజు, బంగారయ్య, యాకూబ్, ఐలయ్య, పాపయ్య, నాగేష్, దాసు, రామారావు, నదీమ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సురవరం మరణం భారత విప్లవోద్యమానికి తీరని నష్టం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కమ్యూనిస్టు దిగ్గజం, సిపిఐ అగ్ర నేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం భారత విప్లవోద్యమానికి తీరని నష్టదాయకమని సిపిఐ సీనియర్ నాయకులు ఎం.నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్‌లో సిపిఐ శ్రేణులు సిపిఐ అగ్రనేత, మార్క్సిజ అపర మేధావి దివంగత సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎం. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి గొప్ప కమ్యూనిస్టు అని జాతీయ అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను సవాళ్ళను 20 సంవత్సరాల ముందే వాటి ప్రమాదాలు పర్యవసానాలను పసిగట్టి పార్టీ శ్రేణులను సమరశీల పోరాటాల వైపు నడుపుతూ భారత విప్లవోద్యమాన్ని ఉరకలు పెట్టించారన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెదకొత్తపలి మండలం పరిధిలోని సురవరం సుధాకర్ రెడ్డి అమ్మమ్మ గ్రామమైన కొండ్రావుపల్లిలో జన్మించాడని, అలంపూర్ తాలూకా పరిధిలోని కంచుపాడు స్వగ్రామంలో బాల్యం విద్య కర్నూల్ జిల్లాలో విద్యను కొనసాగిస్తూ ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యారంగా సమస్యలపై అలుపెరగని పోరాటం కొనసాగించిన సురవరం సుధాకర్ రెడ్డి అంచలంచలుగా ఎదుగుతూ ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా విద్యా వైద్య ఉపాధి హక్కులకై ఉద్యమించి భారత విద్యార్థి యువతను ఏకం చేశాడని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి వామపక్ష ఐక్యత కోసం పరితపిస్తూ వామపక్ష ఐక్య ఉద్యమాన్ని నిర్మించారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూన్ భవన్ నుండి ప్రారంభమవుతుందని అనంతరం సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అందజేయడం జరుగుతుందని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్రలో మహబూబ్నగర్ జిల్లా పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజాసంఘాల కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ రెడ్డి, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్, ఉమ్మడి జిల్లా సిపిఐ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డపార నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, కొండికంటి పద్మావతి, సిపిఐ జిల్లా నాయకులు కోటకద్ర నరసింహ, సత్యనారాయణ రెడ్డి, చాంద్ భాష, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, అరుణ్, కోటేశ్వర్ రెడ్డి, గంటల శ్రీను, దేవానంద్, రంగన్న, బసవరాజ్, శ్రీశైలం, ఇందిరక్క, బాలమణి, ఇందిరా పాల్గొనారు.

పర్యావరణ హితంగా గణేష్ చతుర్థి జరుపుకుందాం: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యావరణ హితంగా, ఘనంగా గణేష్ చతుర్థిని జరుపుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలను కోరారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం లో ఉద్యోగులకు, సిబ్బందికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో కలిసి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... గణేష్ చతుర్థి పది రోజుల పాటు జరిగే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ పండుగను పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా జరుపుకోవడమే జీహెచ్ఎంసీ ముఖ్య ఉద్దేశ్యమని తెలియజేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శానిటేషన్, వీధి లైట్లు, చెట్ల కొమ్మల తొలగింపు, రోడ్డు మరమ్మత్తులు, నిమజ్జన ఏర్పాట్లలో క్రేన్లు, కంట్రోల్ రూములు, బేబీ పాండ్‌లు, ఎక్సవేటరీ పాండ్‌లు, తాత్కాలిక పాండ్‌ల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్రల సందర్భంగా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి తీసుకుంటామని తెలిపారు. 25 వేల మంది కార్మికులు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించనున్నారని మేయర్ తెలిపారు. పర్యావరణానికి హానికరమైన పి.ఓ.పి విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలి ఆమె కోరారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 2 లక్షల మట్టి వినాయక విగ్రహాలను క్షేత్రస్థాయిలో పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ, భక్తులకు ఏలాంటి అసౌర్యం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. శనివారం గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల తనిఖీలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డిలతో కలిసి శామీర్ పేట్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడూతూ గతంలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ ఈసారి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువు పరిసరాలలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నీటి మట్టం ఎక్కువగా ఉన్న మధ్య భాగంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. విగ్రహాల వాహనాలు వెళ్లేందుకు రహదారిని పరిశీలించి, వెంటనేరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. భక్తులకు త్రాగునీరు, వైద్య సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా అధికారులందరు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తూంకుంట మున్సిపల్ కమీషన్ జ్యోతి, ఆర్ అండ్ బి అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి, ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, విద్యుత్తు, పోలీస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలంలో స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే శంకర్ నేతృత్వంలో గతంలో శంకుస్థాపన చేశారు. శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా నిర్మాణం కోసం తొలి భూమి పూజ కార్యక్రమాలను చేపట్టారు. వేద మంత్రాల సాక్షిగా పూజలు నిర్వహించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే మొదటి విడత కింద రాష్ట్రంలో 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ప్రభుత్వం ప్రారంభించగా, రెండో విడత కింద రాష్ట్ర వ్యాప్తంగా 26 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. సుమారు రూ.200 కోట్లతో స్కూల్ నిర్మాణ పనులు చేపట్టబోతున్నారు.

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక చవితి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని మల్కాజిగిరి జోన్ ఏసీపీ చక్రపాణి మండప నిర్వాహకులకు సూచించారు. శనివారం మల్కాజిగిరి శ్రీ శుభం ఫంక్షన్ హాల్‌లో మల్కాజిగిరి ఇన్స్పెక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు, మండప నిర్వాహకులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ చిన్న విగ్రహాల నుండి పెద్ద విగ్రహాల ఏర్పాటుపై నిర్వాహకులు పోలీసే స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. మండపం దగ్గర తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా నిర్వాహకులు షిఫ్ట్‌లో వారిగా మండపంలో ఉడాలన్నారు. విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు సంబందిత విభాగం అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. మండపం వద్ద సౌండ్ పొలూషన్ లేకుండా చూడాలన్నారు. పోలీసు విభాగంతో పాటు ఇతర విభాగాల అధికారులకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శ్రవణ్, సర్కిల్ డీసీ జకియా సుల్తానా, డిఐ శ్రీశైలం, ఎస్.ఐలు శంకర్, గణేష్, ఏఎంఓహెచ్ డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

విద్యా వెంకట్‌ను పరామర్శించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సీనియర్ పాత్రికేయులు విద్యా వెంకట్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కూకట్‌పల్లి రాందేవ్ రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలియగానే కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాస్పిటల్‌కి వెళ్లి విద్యా వెంకట్‌ని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుతం జరుగుతున్న చికిత్స విధానం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలను వినియోగించి, మెరుగైన వైద్యం అందించి వెంకట్ త్వరగా కోలుకునే విధంగా చూడాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యోబ్, నాయకులు పురెందర్ రెడ్డి, ఆనంద్, పాత్రికేయ మిత్రులు రాహుల్, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతికి ఘన నివాళులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ (సిఆర్ ఫౌండేషన్) సలహాదారు, మాజీ గౌరవ అధ్యక్షులు, మాజీ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి కొండాపూర్ లోని సిఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఘనంగా నివాళులర్పించారు. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సురవరం సుధాకర్ రెడ్డి సిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపన దగ్గర నుండి పలు ఉన్నత హెూదాలలో ఫౌండేషన్ అభ్యున్నతికి తుది శ్వాస వరకు కృషి చేశారని, పార్లమెంట్ సభ్యునిగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, కార్మిక- కర్షక, పీడత ప్రజల హక్కులు రక్షించడానికి శాయశక్తుల కృషి చేశారని ఈ సందర్భంగా ప్రసంగించిన సీ ఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి. చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. సుధాకర్ రెడ్డి సతీమణి బీవీ విజయలక్ష్మి కుమారులు నిఖిల్, కపిల్ తదితర కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్య, యన్.రాజేంద్రరావు, మహిళాసంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు వి. లలిత, సీనియర్ పాత్రికేయులు డాక్టర్. ఏబికె ప్రసాద్, సీనియర్ వైద్యురాలు డాక్టర్ ప్రతిభ, సిపిఐ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి రామకృష్ణ, వారి సతీమణి శేర్లింగంపల్లి మహిళా మండల కార్యదర్శి వరలక్ష్మి, విశ్రాంత సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు, వృద్ధాశ్రమ మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, విద్యార్థినిలు తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

గొప్ప కమ్యూనిస్టు నేత, మేధావిని కోల్పోయాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థి, యువజన, వ్యవసాయ కార్మిక సంఘాలలో పనిచేస్తూ, వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ, గొప్ప పార్లమెంటేరియన్‌గా యావత్ దేశ ప్రజల సమస్యలపై ఎలుగెత్తి చాటడమే కాకుండా, పార్లమెంటులో కార్మికవర్గం పక్షాన పోరాటాలు ఉద్యమాలు చేసిన మానవతావాది సురవరం ఇక లేరని తెలిసి, సురవరం లేని లోటు తీర్చలేనిదని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయ పున: ప్రారంభానికి హాజరై ఉత్తేజితకరమైన ఉపన్యాసం ఇచ్చి అందరి మన్ననలను పొందిన సురవరం అంతలోనే, మృత్యువుతో పోరాడుతూ చనిపోయారని తెలిసి ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సంతాపం, సానుభూతి తెలియజేశారు.

విశాలాంధ్ర - మొయినాబాద్‌లో : సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి అన్నారు. సీపీఐ చేవెళ్ల సమితి ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో సురవరం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాల వ్యాప్తికి సురవరం విశేష కృషి చేసినట్లు తెలిపారు. ఆయన నేతృత్వంలో పనిచేసిన అనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తర్వాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి చక్కని వాగ్ధాటి, విషయ స్పష్టత కలిగిన వక్త అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, సిపిఎం డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి. మక్బూల్, సుధాకర్ గౌడ్, వడ్ల మంజుల మహిళా సంఘం మండల కార్యదర్శి లలిత, వెంకటమ్మ, యశోద, అంజిరెడ్డి, యాదగిరి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జవహర్‌నగర్‌లో : సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ శనివారం రావి నారాయణరెడ్డి నగర్ జవహర్‌నగర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి జవహర్‌నగర్‌లో సిపిఐ నాయకులు కార్యకర్తలు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ పూలమాలవేసి నివాళులర్పించారు.వారి జ్ఞాపకార్థాలు స్మరించుకొని గిరి ప్రసాద్ నగర్ డెంటల్ కాలేజీ భూ పోరాటం లో గుడిసె వాసులకు అండగా నిలిచిన వ్యక్తి అని ఇక్కడ భూ పోరాట ఉద్యమంలో పేదల పక్షాన నిలబడ్డారు అని ఆయన పోరాటాల స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఎన్నో త్యాగాలు చేసిన చరిత్ర సురవరం సుధాకర్ రెడ్డి కి దక్కిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుతోటపల్లి శంకర్ నిమ్మల నరసింహులు ఆయన సేవలను కొనియాడారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవి నాయక్, గిరి ప్రసాద్ నగర్ మాజీ సహాయ కార్యదర్శి సురేష్ సిపిఐ నాయకులు మంగలి కొండయ్య, యువజన సమైక్య నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షాను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై కక్షపూరితంగా అమిత్ షా చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. దేశ హెూంమంత్రిగా ఉన్న అమిత్‌షా లేనివి ఉన్నట్లుగా సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించటం ఆయన స్థాయికి తగదని బోస్ అన్నారు. ఇప్పటి వరకు దేశంలో హెూం మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఏ మంత్రి ఇలాంటి నీచ స్థితికి దిగజారలేదని ఆయన మండిపడ్డారు. సుదర్శన్ రెడ్డిపై నిందారోపణలు చేసిన అమిత్ షాను వెంటను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జస్టీస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇచ్చారని చెప్పటం అమిత్ షా అవగాహనలోపం మరియు బుద్ధిమాన్యానికి నిదర్శనమన్నారు. సుదర్శన్ రెడ్డి పదవీలో ఉన్నప్పుడు సల్వాజుడుంపై ఇచ్చిన తీర్పును అసందర్భంగా ఈ సమయంలో చెప్పటం అమిత్ షా నీచ సంస్కృతి బహిర్గతమయ్యిందన్నారు. సల్వాజుడుం సందర్భంగా మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్న ఆనాటి ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరుపై సుదర్శన్ రెడ్డి మానవత్వానికి ప్రాముఖ్య తను ఇస్తూ ఇచ్చిన తీర్పు దేశంలోని మానవ విలువలకు ఆయన ఇచ్చినటువంటి విలువలను అర్థం చేసుకోకుండా ఆయన ఇచ్చిన తీర్పు మూలంగా నక్సలిజం ఇప్పటి వరకు కొనసాగుతున్నదని చెప్పటం అమిత్‌షా మానసిక స్థితికి అద్దంపడుతున్నదన్నారు. అమిత్ షా హెూం మంత్రిగా ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలో అవినీతి లేకుండా చేస్తానని గొప్పగా ప్రకటించి ఇప్పటి వరకు ఏం చేసిందో, అవినీతి సమాజంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నదో అమిత్ షా చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతిని రూపుమాపటంలో, ఉగ్రవా దాన్ని నిర్మూలించటంలో పూర్తిగా విఫలమైన అమిత్ షా ప్రభుత్వం నక్సలిజాన్ని అనిచివేయటా నికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పే కారణమని చెప్పటం వారి అబద్దాల చరిత్రకు నిదర్శనమన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తమ అభ్యర్థికి తిరుగులేదని ఊహించిన అమిత్ షా ప్రభుత్వానికి ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప్రకటించటంతో కేంద్ర ప్రభుత్వ గొంతులో వెలక్కాయపడినట్లుగా అయ్యింది. అందుకే అమిత్ షా లాంటి బిజెపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్యగా అబద్దాలను ప్రచారం చేస్తున్నారు.

బాల్యం నుండే క్రీడలపై ఆసక్తి కలిగించాలి : మంత్రి వాకిటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పసిప్రాయం నుండే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖమంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు. మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రము నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను నిర్వహించబోతున్నామని, జాతీయ క్రీడా దినోత్సవం అని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వర్గాల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందించామని ఆయన అన్నారు. కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ అనిత పి ఆర్ ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు ఫ్యూచర్ ఒలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకమైన కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేందుకు, మెరుగైన పని పరిస్థితులను కల్పించడానికి, కార్మికుల సేవలను సమర్థవంతంగా అందించేందుకు యాజమాన్యంతో సమన్వయంగా పనిచేయడానికి కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐ.ఎన్.టి.యు.సి గొడుగు కింద పని చేయాలనీ నిర్ణయించామని హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి. ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఉద్యోగ, కార్మికులు హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఐఎన్.టి.యు.సి బ్యానర్ కింద ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్.టి.యు.సి కార్యాలయంలో శనివారం జరిగిన కాంగ్రెస్ అనుబంధ జలమండలి కార్మిక సంఘాల సమావేశంలో శ్రామిక శక్తి సమిష్టి ప్రయత్నాలకు నాయకత్వం వహించడానికి హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా టి.పి.రాఘవేంద్ర రాజ్, ఎ.శ్రావణ్ కుమార్, మొహమ్మద్ జహంగీర్, బి.దేవేందర్, చంద్రశేఖర్, సయ్యద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్‌రావు, ఎం.రాజా, బి.జైరాజ్, సురేష్‌బాబు, కె.రామరాజు, బి.భూమయ్యలను ఎన్నుకున్నారు. ఐఎన్.టి.యు.సి నాయకత్వంలో అనుబంధ సంఘాలన్నీ ఐక్యత, పారదర్శకత, నిబద్ధతతో పనిచేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి గుర్తింపు సంఘమైన బిఆర్ఎస్ అనుబంధ బి.ఆర్.టి.యు నేతల చేతకాని తనం వల్ల ఓవర్ టైమ్ చేసిన కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అదనంగా పనిచేసిన కార్మికులకు ఓవర్ టైమ్ (ఓటి) అలవెన్స్ చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మరియు జలమండలి ఎండి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా 42 శాతం రిజర్వేషన్ ను అమలు చేస్తామనీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తక్షణమే అమలు చేయాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాండు యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాండు యాదవ్ మాట్లాడుతూ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల పేర్లతో ఇటు తిప్పి అటు తిప్పి 42 శాతం రిజర్వేషన్ను అటకెక్కించే ప్రయత్నం స్పష్టంగా కనబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఇంతకంటే జఠలమైన ఈడబ్ల్యుఎస్‌ను అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని అమలు చేయటం పెద్ద విషయం కాదన్నారు. ఇకనైనా కాలయాపన చేయకుండా ప్రభుత్వ నిర్ణయాన్ని ను ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిని తానే ప్రకటించిన అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ రెడ్డిని తీసుకువచ్చి ఇవాళ అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నదనీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఇక్కడే తేలిపోతుందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఒక బిసి దొరకకపోవడం శోచనీయం అనీ, బీసీ ప్రజలు యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు కావు అన్న విషయాన్ని గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీసీ కులాల ఐక్యవేదిక పిలుపునిస్తున్న దన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలు పోను మిగిలిన అన్ని స్థానాల్లో బీసీలు, బీసీ మహిళలను నాయకులను ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు బీసీ యువత, బిసి ప్రజలు వెన్నంటి ఉండి వీరిని రాబోయే ఎన్నికలలో ఘన విజయంతో గెలిపించుకోవాలని కోరారు. పాలకవర్గాలు, అగ్రకుల పార్టీలు బీసీలను ఎప్పటికీ అధికారంలోకి రానివ్వవు అన్న సత్యాన్ని గుర్తించి మనమే ఒక రాజకీయ శక్తిగా ఎదగలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సంధ్యారాణి, కాశీనాథ్ ముదిరాజ్, విజయ్, మహేంద్ర, లీగల్ సెల్ జే అరుణ్ కుమార్, దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి నర్సింలు ముదిరాజ్, లోకపల్లి భీమేష్, రమేష్, ఎం. ఆంజనేయులు, సురేందర్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బేయర్ కామాలస్‌తో పురుగుల నుంచి పంటలకు రక్షణ

విశాలాంధ్ర - కరీంనగర్ : వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ రంగాలలో అత్యున్నత సామర్థ్యాలు కలిగిన అంతర్జాతీయ సంస్థ బేయర్ భారతీయ ఉద్యానవన రైతుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన వినూత్నమైన క్రిమిసంహారక మందు కామలస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు మాట్లాడుతూ ఆకు/ కాయ తొలిచే రసం పీల్చే కీటకాలను సమర్థవంతంగా నిర్వహించటంలో కామలస్ తోడ్పడుతుందన్నారు. ఇది ఉద్యానవన పంటల సాగులో అవసరమైన తోడ్పాటును అందిస్తుందని, భారతదేశంలోని కీలకమైన రాష్ట్రాలలోని ఖరీదైన కూరగాయల మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కామలస్ ఆగస్టు 2025 నుండి పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలలో అందుబాటులో ఉంటుందన్నారు. భారతీయ కూరగాయల రైతులు, ముఖ్యంగా చిన్న కారు రైతులు, ఆకు/ కాయ తొలిచే మరియు రసం పీల్చే కీటకాల ముట్టడి నుండి అధిక ఒత్తిడిని ఎదుర్కొంటుంటారని, దీనికి తరచుగా పంటపై స్ప్రే చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇది, ఇప్పటికే ఉన్న ఉత్పత్తుల తగ్గుతున్న ప్రభావంతో కలిపి, ప్రత్యేక అవసరాల అంతరానికి దారితీస్తుందన్నారు. బేయర్ కామలస్ ఈ అంతరాన్ని ఒక వినూత్న ద్వంద్వ తరహా చర్యతో పరిష్కరిస్తుంది, ఇది కీటకాలు త్వరగా తినకుండా ఆపుతుందన్నారు. మొక్కను లోపల నుండి, వేర్లు, ఆకుల ద్వారా రక్షిస్తుంది. కూరగాయల పెంపకందారులు, ముఖ్యంగా టమోటా, వంకాయ, మిరపకాయ, క్యాబేజీ మరియు బెండకాయ పంటలను పండించే వారు, పంట ప్రారంభ దశలలో ఉపయోగించినప్పుడు కామలస్‌ను శక్తివంతమైన పరిష్కారంగా కనుగొంటున్నారన్నారు. భారతదేశ పోషక భద్రతా అవసరాలను తీర్చడంలో కూరగాయల పంటలు అత్యంత కీలకంగా ఉన్నాయని, ప్రపంచ ఎగుమతి ఆర్థిక వ్యవస్థలో దేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. కూరగాయల వినియోగం పెరుగుతున్న కొద్దీ, పంట ఉత్పాదకత, నాణ్యతను నిర్ధారించడం మరింత కీలకం అవుతుందన్నారు. కామలస్‌తో, టాము తదుపరి తరం పురుగుమందును తీసుకువచ్చాము, ఇది కీటకాల నిర్వహణను బలోపేతం చేయడమే కాకుండా భారతదేశం, ప్రపంచానికి స్థిరంగా, అధిక నాణ్యత గల కూరగాయల వాల్యూ చైన్ నిర్మించడంలో కూడా దోహదపడుతుంది.." అని అన్నారు.

జలమండలిలో ఏఐ సాంకేతికత

విశాలాంధ్ర - హైదరాబాద్ : తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, అధునాతన సాంకేతికత వినియోగంలో దేశంలో ఇతర బోర్డుల కంటే ఉన్నతంగా ఉన్న జలమండలి.. ఇప్పుడు వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటర్ఫేస్) అనే అధునాతన సాంకేతికతను వినియోగిస్తోంది. జలమండలి గత సంవత్సర కాలంలో మెట్రో కస్టమర్ కేర్(ఎంసీసీ)లో నమోదు అయినా ఫిర్యాదులను ఏఐ ద్వారా కొన్ని రోజులగా ఐటీ విభాగపు అధికారులు విశ్లేషిస్తున్నారు. గత సంవత్సర కాలంలో ఎంసీసీలో నమోదైన ఫిర్యాదులను, ట్యాంకర్ బుకింగ్ వివరాలను ఏఐ సాంకేతికత సాయంతో గత కొన్ని రోజులుగా విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణలో ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయో, ఏయే ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు, తరుచూ నమోదవుతున్న ఫిర్యాదులను వివిధ కోణాల్లో విశ్లేషిస్తున్నారు. అలాగే, గత సంవత్సర కాలంగా ట్యాంకర్ బుకింగ్ ల వివరాలతో ఏయే డివిజన్ లో అత్యధికంగా బుకింగ్ లు అవుతున్నాయో, ఏయే ప్రాంతాలతో పాటు అత్యధికంగా ట్యాంకర్ లను బుక్ చేసిన వినియోగదారుల వివరాలను సైతం, ఏఐ సాంకేతికతతో విశ్లేషించారు. కాగా గత సెప్టెంబరు 1 నుంచి.. ఇప్పటివరకు 6 లక్షల 50 వేలకు పైగా వివిధ సమస్యలపై ఫిర్యాదులు జలమండలి కస్టమర్ కేర్ కు అందగా, 12 లక్షలపైగా వాటర్ ట్యాంకర్ లను వినియోగదారులు బుక్ చేసుకున్నారు. అత్యధికంగా ట్యాంకర్ బుక్ చేసిన ప్రాంతాలలో ప్రగతినగర్ లోని సాహితి రెసిడెన్సీ అపార్ట్మెంట్ గత సంవత్సరంలో 674 వందల ట్యాంకర్ లను బుక్ చేసినట్టు తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రగతీనగర్ లో నీటి సరఫరా, అత్యధిక ట్యాంకర్ బుకింగ్ వివరాలతో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో కలిసి, సమస్యాత్మక ప్రాంతాలను స్థానికులతో పర్యటించారు. రెండు నెలల రెండు రోజులకు ఒక సారి తాగునీటి సరఫరా అవుతోందని అలాగే, రోజు విడిచి రోజు నీటి సరఫరా అందేలాగా స్థానికులు జలమండలి ఎండీకి విన్నవించుకున్నారు. అందుకే ఎండీ రోజు విడిచి రోజు నీటి సరఫరా చేపట్టవలసిన పనులను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్ సంపుకు ప్రత్యేక ఫీడర్ మెయిన్ అభివృద్ధి చేస్తే ఈ సమస్య తీరిపోతుందని, దానికి రూ.3 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు ఎండీకి వివరించారు. దానికి వెంటనే ప్రతిపాదనలను పరిశీలించిన ఎండీ, వెంటనే పనులు చేపట్టాలని ఆమోద ముద్ర వేశారు. ఈ ప్రగతినగర్ ఎత్తైన ప్రాంతాల్లో ఉండటం, భూగర్భంలో ఎక్కువగా రాళ్లు కూడి ఉండటంతో.. బోర్లు సఫలం కాక, సఫలమైన వేసవిలో అంటడిగి పోవడంతో.. ఈ ప్రాంతవాసులు త్రాగునీరు కోసం జలమండలిపై అధారపడుతున్నట్లు గుర్తించారు.

ఐయంఈసిఈ ని నిర్వహించనున్న అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో సహాయ సహకారాలను, విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవటాలను ప్రోత్సహించే ఒక అగ్రశ్రేణి అంతర్జాతీయ సంస్థ అయిన అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్, తన ఫ్లాగ్ షిప్ ఈవెంట్ అయిన ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్పొజిషన్ (ఐయంఈసిఈ)ను భారతదేశంలో మొట్టమొదటి సారిగా నిర్వహించనున్నది. ఈ కార్యక్రమం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో 2025 సెప్టెంబర్ 10 నుండి 13వ తేదీ వరకు జరుగుతుంది. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల్లో సాధించిన విజయాలను విశదంగా తెలుసుకునేందుకు, ఈ కార్యక్రమాన్ని అగ్రగాములైన వ్యక్తులు, పరిశోధకులు, పరిశ్రమలో ప్రొఫెషనల్స్, పాలసీలను తయారు చేసే వారు, విద్యార్థులను ఒక చోటకు చేర్చే ఐయంఈసిఈ ఈవెంట్‌ను సాధారణంగా అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ అమెరికాలో నిర్వహిస్తుంది. కానీ మొట్టమొదటి సారిగా ఐయంఈసిఈ ఇండియా 2025 ఈవెంట్‌ను అమెరికా అవతల భారత్ (హైదరాబాద్) లో అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ నిర్వహించడం జరుగుతున్నది. ఐయంఈసిఈ ఇండియా 2025 థీమ్, అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాలు మొదలుకుని మెకానికల్ సిస్టమ్‌లలో ఏఐ- రోబోటిక్స్ ను తయారీ ప్రక్రియలతో మేళవించే వరకు, సుస్థిరమైన డిజైన్ పద్ధతులు మొదలుకుని అంతర్జాతీయ సామాజిక సవాళ్ళలో మెకానికల్ ఇంజనీరింగ్ పాత్ర వరకు, వివిధ అంశాలను ప్రతిబింబిస్తుంది. 650కు పైగా పరిశోధనా పత్రాలు సాంకేతిక ప్రదర్శనలు, 1500మంది ప్రతినిధులు, 100మంది ప్రదర్శకులతో కూడిన ఐయంఈసిఈ ఇండియా 2025, ఇంజనీరింగ్ జ్ఞానవృద్ధికి, విద్యా-పరిశ్రమల భాగస్వామ్య బలోపేతానికి, అలాగే ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే వినూత్న పరిష్కారాల వేగవంతతకు ప్రేరక శక్తిగా నిలవనుంది. ఈ మూడురోజుల సదస్సు, వైవిధ్యభరితమైన టెక్నికల్ ట్రాక్స్ లో విస్తారమైన ప్రోగ్రామ్ ను ప్రెజెంట్ చేస్తుంది. వాటిలో ఎడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, 3డి ప్రింటింగ్, అడ్వాన్స్ మెటీరియల్స్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీలు, థర్మల్ టెక్నాలజీలలో పురోగతి, సెమీ-కండక్టర్ మాన్యుఫాక్చరింగ్, పరిశుద్ధమైన ఎనర్జీ టెక్నాలజీలు, సిస్టమ్స్ మొదలగు తదితర సెషన్లు, పలు పరిశ్రమల్లో మెకానికల్ ఇంజనీరింగ్ భవిష్యత్తుకు రూపం కల్పిస్తున్న తాజా విజయాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాయి. ఐయంఈసిఈ ఇండియా 2025 లో ప్రతినిధులు, ఫ్యాకల్టీ, విద్యార్థులకు రిజిస్ట్రేషన్‌హోలు ఇప్పుడు ప్రారంభం అయ్యాయి.

సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళులు

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం పరిధిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్, ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం సిపిఐ పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డికి మృతి పట్ల సిపిఐ నేతలు నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని సుధాకర్ రెడ్డి సమాజంలో పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం పోరాడినవారు. విద్యుత్ చార్జీలు పెంపు, రైతు సంక్షోభం, కార్మిక హక్కులు, వ్యక్తుల ఆర్థిక, సామాజిక హక్కుల రక్షణకు ఆయన అఖండ పోరాటం సాగించారు. మండల సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు, బీసీ సంఘం జిల్లా నాయకులు కె. ప్రమీల, బి.కే.ఎం.యు. మండల అధ్యక్ష కార్యదర్శులు కె.మహాలక్ష్మి, బి.ఐలయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, మండల కౌన్సిల్ సభ్యులు నర్సమ్మ, ఇస్తారి, సోమరాజు, పి ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా వినాయక చవితిని జరుపుకోవాలి

విశాలాంధ్ర - కొత్తూరు: త్వరలో జరగబోయే వినాయక చవితి పండుగను కుల మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ నరసింహారావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని అన్ని గ్రామాల మత పెద్దలు, యువకులు, నాయకులతో శాంతియుత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు నిర్వహించేవారు తమతమ మండపాల వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగ మండపాలను ఏర్పాటు చేయరాదని, గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ లైట్ల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో అనుమతి తీసుకోవాలని, రాత్రి 10 దాటితే మైకులను నిలిపివేయాలని, నిమజ్జనం సమయంలో డీజెలకు అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవిధంగ వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సైలు గోపాల కృష్ణ, సత్యశీల రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు యువకులు మత పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: క్రిస్టియన్ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్రిస్టియన్ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు కనిపించే విధంగా అన్ని కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, అదేవిధంగా ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళలకు ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ, ఇంద్రమ్మ ఇండ్లను కూడా మహిళలకు అందజేస్తుందని అన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గణేష్ ఉత్సవాలతో పాటు నిమజ్జనానికి అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ డి.శశిరేఖ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని ఎటువంటి పొరపాట్లు అసౌకర్యాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. చందానగర్ సర్కిల్ పరిధిలో మంజుల రఘునాథ్ రెడ్డి కార్పొరేటర్, గణేష్ ఉత్సవ కమిటీ వారితో, సర్కిల్ కి సంబంధించిన అధికారులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సహా పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి గణేష్ ప్రిపరేడెన్స్ మీటింగ్ నిర్వహించి గంగారం చెరువు, గురునాథం చెరువు కొత్తకుంటా లేక్ రేగులకుంటా పోర్టబుల్ బేబీ పాండ్ పీజేఆర్ స్టేడియం, కడియం కుంట, తోపాటు ప్రధాన, అంతర్గత రహదారులను శుభ్రపరచాలని ఆయా విభాగాల నడుమ ఎటువంటి సమన్వయ లోపం లేకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని, ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, డెంగ్యూ కేసులు గుర్తించ బడిన ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, ఎంటమాలజీ ఎలెక్ట్రికల్ వార్డ్ ఆఫీసర్ వాటర్ డిపార్ట్మెంట్ విభాగాలతో పాటు ఆయా విభాగాల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ మెంబర్లు ఉన్నారు.

తెలుగు సాహిత్యంలో దాశరథి రంగాచార్యులది విశిష్ట స్థానం



విశాలాంధ్ర - సిద్దిపేట : తెలంగాణకు ఒక విశిష్టమైన చరిత్ర కలిగి ఉన్నది. నాటి నుండి నేటి వరకు ఈ గడ్డపై పోరాడిన వీరులు, కవులు, రచయితలు కళాకారులు ఎంతో మంది ఉన్నారు. నాటి తెలంగాణ పోరాటాన్ని కళ్ళారా చూసిన సాహితీయోధుడు డా. దాశరథి రంగాచార్య, తెలంగాణ ప్రజల జీవనాన్ని, అస్తిత్వాన్ని పోరాటాలను తన రచనల ద్వారా తెలియజేశాడు. తెలుగు సాహిత్యంలో దాశరథి రంగాచార్యులది విశిష్ట స్థానం. తెలంగాణ పోరాట నేపథ్యాన్ని తన జీవశక్తిగా మలుచుకొని, తెలుగువారి సాంస్కృతిక జీవనాన్ని అద్భుతంగా చిత్రించిన రచయిత సాహితీయోధుడు రంగాచార్యులు. డాక్టర్. దాశరథి రంగాచార్య, మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో జన్మించాడు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయునిగా, గ్రంథాలయ నిర్వహకునిగా, సికింద్రాబాద్ పురపాలక శాఖలో పనిచేశాడు. ఈయన విశిష్టమైన నవలలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి రంగాచార్యులు. నాలుగు వేదాలు, పది ఉపనిషత్తులను తెలుగులోకి అనువాదించాడు. రామాయణ, భారత, భాగవతాలను సరళ వచనరూపంలో రాశాడు. తెలుగు నవలలో పాత్రో చిత యాసను మొదటగా ప్రవేశపెట్టాడు. వీరి రచనలు ఇతర భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి. ఈయన రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది. ఈయన జీవిత చరిత్రను "మోదుగుపులు" నవలలో చిత్రించారు." జనపదం" అనే నవలలో సమాజాన్ని మొత్తం మైక్రోస్కోపిక్‌గా చూపించిన దాశరథి రంగాచార్య గొప్ప రచయిత.

వేలాడుతున్న కరెంట్ వైర్లపై తక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్ ఈస్ట్ లక్ష్మినగర్ కాలనీలో కరెంట్ వైర్లు ప్రమాదకరంగా కిందకి వాలిపోవడంతో నివాసితులను ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికులు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవికి తెలియజేయగా ఆయన వెంటనే స్థలాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిపించి ప్రజలకు రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలలో ఎలాంటి సమస్యలు కలగకుండా పనులు పూర్తి చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్ల గురించి మాట్లాడి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఏఈ సత్యనారాయణ రెడ్డి, అజయ్ రెడ్డి, సంబంధిత అధికారులు స్థానిక కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభల చిత్రమాలిక

కదం తొక్కుతూ... పదం పాడుతూ...

ఎర్రసంద్రమైన ఒంగోలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: సీపీఐ రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా ఒంగోలు ఎరుపెక్కింది. కామ్రేడ్లు కదం తొక్కారు. భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 28వ మహాసభలను పురస్కరించుకుని శనివారం ఒంగోలు నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శన సీపీఐ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు కదం తొక్కుతూ, పదం పాడుతూ మహాప్రదర్శనలో పాల్గొన్నారు. నెల్లూరు బస్టాండ్ సెంటర్ లోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన భారీ ప్రదర్శన కలెక్టరేట్, ట్రంకు రోడ్డు, అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, కొత్త కూరగాయల మార్కెట్ మీదుగా సభా ప్రాంగణం వరకు సాగింది. ఈ ర్యాలీకి రాష్ట్ర నలుమూల నుంచి సీపీఐ, ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు పోటాపోటీగా తరలివచ్చారు. పురుషులు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎరుపు చీరలు ధరించి ప్రదర్శనలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కొందరు మహిళలు చంటి పిల్లలను ఒక చేత్తో ఎత్తుకొని, మరోచేత్తో ఎర్రజెండా చేతబూని ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొనడం అందరినీ ఉత్తేజపరిచింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీపీఐ జిందాబాద్, ఎర్రజెండా వర్థిల్లాలి అనే నినాదాలతో నగర వీధులు మారుమోగాయి. నగరంలో ఎటు చూసినా ఎర్రజెండాలు, అరుణ పతాకాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లతో ఎరుపుమయమైంది. కిలోమీటర్ల పొడవునా ముందుభాగాన సాగిన రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు, పార్టీ మహాసభల సంఖ్యను సూచిస్తూ 28 సీపీఐ పార్టీ పతాకాలతో సాగిన రెడ్‌ఫ్లాగ్ మార్చ్ ప్రజలను ఆకర్షించింది.

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, ఏఐకేఎస్ ప్రధానకార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, హరినాథరెడ్డి, రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, జగదీశ్, సినీ నటుడు మాదాల రవి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు ప్రదర్శన అగ్రభాగాన నిలిచారు. వివిధ జిల్లాలకు చెందిన సీపీఐ కార్యదర్శులు వారి జిల్లాలకు సంబంధించిన ప్రధాన డిమాండ్లతో కూడిన బ్యానర్లు చేబూని ఒక క్రమ పద్ధతిలో ప్రదర్శనలో పాల్గొన్నారు. సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాలకు చెందిన శ్రేణులు, వివిధ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన వారు కూడా ప్రత్యేక డిమాండ్లతో కూడిన బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొన్నారు. కంకి కొడవలి గుర్తుతో మహిళలు ధరించిన గొడుగులు, యంగ్ కమ్యూనిస్ట్ మార్చ్ పేరుతో యువజనుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. డప్పుల దరువు, కనకతప్పెట్లు, కోలాటాలతో పురవీధులు మారుమోగాయి. కొమ్ముల నృత్యాలు, దింసా నృత్యం, జానపద, గురవయ్యలు, వివిధ ప్రాంతాలకు, గిరిజన తండాలకు సంబంధించిన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు 1000 మంది ప్రజానాట్య మండలి కళాకారులు వంద డప్పులు, వంద పాటలు, వంద గొంతుకల ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండు లైన్లుగా అత్యంత క్రమశిక్షణతో సాగిన ఈ ప్రదర్శనకు ముందుభాగాన భారత లౌకిక వ్యవస్థ, మత సామరస్యతను చాటిచెపుతూ హిందూ, క్రిస్టియన్, ముస్లింల వేషధారణ, మరోవైపు ప్రప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ వేషధారణతో కూడిన ప్రజానాట్య మండలి కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దారిపొడవునా కమ్యూనిస్టు పార్టీ శ్రేయోభిలాషులు, అభిమానులు సీపీఐ నేతలపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కమ్యూనిజం వర్థిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, మార్క్సిజం, లెనినిజం అజరామరం అంటూ ప్రదర్శనకారులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. మోదీ, చంద్రబాబు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శ్రేణులు చేసిన నినాదాలు ప్రజలను ఆలోచింపజేశాయి. వేలాదిమందితో సాగిన ఈ ప్రదర్శన ఒక పాయింట్ దాటడానికి గంట సమయం పట్టింది. అనంతరం కామ్రేడ్ గుజ్జుల యలమందారెడ్డి,సరళాదేవి సభా ప్రాంగణంలో బహిరంగసభ నిర్వహించగా, పార్టీ శ్రేణులతో పాటు రాజకీయపార్టీల కతీతంగా ఈసభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయాల పరిణామాలు, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి కమ్యూనిస్టుపార్టీ శ్రేణుల కర్తవ్యాలను వివరిస్తూ సీపీఐ నేతలు దిశానిర్దేశం చేశారు.

మహాసభల ప్రదర్శన, బహిరంగ సభ హైలెట్స్

- ఒంగోలు పట్టణంలోని నెల్లూరు బస్టాండ్ నుంచి మునిసిపల్ గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శన జరిగింది.
- సుమారు రెండు కిలోమీటర్ల మేర రెడ్ షర్ట్ వాలంటీర్లు 26 జిల్లాల నుంచి వచ్చిన కామ్రేడ్లు ప్రదర్శనలో కదం తొక్కారు.
- ప్రదర్శకులు చేసిన విప్లవ నినాదాలతో ఒంగోలు పురవీధులు దద్దరిల్లాయి.
- ప్రదర్శనగా వెళుతున్న నాయకులను, మహిళలను అభిమానులు, శ్రేయోభిలాషులు పూలవర్షంతో ముంచెత్తారు.
- కళాకారులు డప్పు వాయిద్యాలతో, కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో దారి పొడవునా ఆకట్టుకున్నారు.
- భారీ జన సందోహంతో అద్దంకి బస్టాండ్ కొత్త మార్కెట్ మైదానంలో భారీ బహిరంగ సభ జరిగింది.
- ఈ సభలో ప్రజానాట్య మండలి కళాకారులు గళమెత్తి నృత్యం చేస్తూ గీతాలు ఆలపిస్తూ ప్రజలను ఉర్రూతలూగించారు.

మిత్రుడిని, మార్గదర్శిని కోల్పోయా

డి.రాజా

న్యూదిల్లీ: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డితో తన అనుబంధం దశాబ్దాల నాటిదని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. జాతీయ స్థాయిలో కలిసి పనిచేశామన్నారు. సుధాకర్ రెడ్డి మార్గదర్శకత్వం, ఆలోచనల్లో స్పష్టత, ప్రజలకు మేలు చేయాలనే నిబద్ధత తనను ఎంతగానో ప్రభావితం చేశాయని డి.రాజా వెల్లడించారు. ఇటీవల తెలంగాణలో సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌ను కొత్తగా ప్రారంభించిన కార్యక్రమంలో సుధాకర్ రెడ్డితో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. అదే ఆయన చివరి సభ అన్నారు. సుధాకర్ రెడ్డితో దేశ పరిస్థితులపై, వామపక్షాల ముందున్న సవాళ్లపై, కమ్యూనిస్టుల బాధ్యతలపై సుదీర్ఘ సంభాషణలు జరిగేవని.. దిల్లీ వీపీ హౌస్‌లో అసంఖ్యాత సాయంత్రాలు ఇలా గడిపినట్లు రాజా గుర్తుచేసుకున్నారు. ఆ స్నేహపూర్వక సంభాషణలు, సరదా సాయంత్రాలు ఎప్పటికీ గుర్తు ఉండిపోతాయని అన్నారు. 'సీపీఐ, వామపక్ష ఉద్యమం ఓ శక్తిమంతమైన నాయకుడిని కోల్పోయింది. నేను నా సహచరుడిని, మిత్రుడిని, మార్గదర్శిని కోల్పోయాను. ఆయన లేని లోటు తీరనిది. సుధాకర్ రెడ్డి చిరస్మరణీయుడు' అని డి.రాజా పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర కావాలంటే ఆలోచనా విధానం మారాలి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: ఏడు నెలలుగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' చేస్తున్నామని, స్వర్ణాంధ్ర కావాలంటే ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అంటువ్యాధులు రావడానికి ప్రధాన కారణం చెత్త అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. శనివారం కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను వేసిందే కానీ చెత్త మాత్రం తీయలేదని విమర్శించారు. అక్టోబరు 2 నాటికి అన్ని మునిసిపాలిటీలలో చెత్తాచెదారం తొలగిస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలో ఆలోచిస్తున్నామని, అలాగే పేదవాడి ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రికి హామీ ఇస్తున్నానన్నారు. సంపద సృష్టించడం, ఆదాయాన్ని పెంచడం తమకు తెలుసునని... అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు చేస్తే దీర్ఘకాలం కొనసాగవన్నారు. తాను సూపర్ సిక్స్ అంటే సాధ్యం కాదన్నారని... చేసి చూపించామని ముఖ్యమంత్రి అన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎప్పటికప్పుడు జమ చేస్తున్నాం. 40 వేల హెయిర్ కటింగ్ సెలూన్‌లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు.

సందడిగా ఒంగోలు పుస్తక ప్రదర్శన

తొమ్మిదివ రోజు కళల ప్రదర్శన, సాహిత్య చర్చలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: ఒంగోలులో మూడవ పుస్తక మహోత్సవం తొమ్మిదవ రోజు శనివారం పెద్ద సంఖ్యలో పుస్తక ప్రియులు, ప్రజలతో సందడి నెలకొంది. ఈ పుస్తక ప్రదర్శనకు 24వ తేదీ ఆదివారం చివరి రోజు కావడంతో పాఠకులు, ప్రజలు పుస్తకాలను కొనుగోలు చేయడానికి స్టాల్స్ వద్దకు ఉత్సాహంగా తరలివచ్చారు. ప్రజల కోరిక మేరకు పుస్తక మహోత్సవం చివరి రోజున ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

విద్యార్థుల ప్రతిభ, కళారూపాల ప్రదర్శన

పుస్తక మహోత్సవ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాల విద్యార్థుల కోసం మోనో యాక్షన్, మైమ్ పోటీలు నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థులు తమకు ఇష్టమైన పుస్తకాల్లోని పాత్రలుగా వేషధారణ చేసి, ఆ పాత్రల సంభాషణలను పలికించి ప్రేక్షకులను అలరించారు. సాయంత్రం 5 గంటలకు పెదపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 'తెలుగు వెలుగులు' అనే ఒక గంట నిడివి గల నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఇందులో వారు తెలుగు సాహిత్య చరిత్ర, సంస్కృతిని పాత్రల రూపంలో ప్రదర్శించి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

విశాలాంధ్ర పుస్తకావిష్కరణ... జిల్లా కళారూపాలపై చర్చ

సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు చెందిన ముఖ్యమైన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఏటుకూరి బలరామమూర్తి రచించిన 'మన చరిత్ర' పుస్తకాన్ని విడుదల చేశారు. రాహుల్ సాంకృత్యాయన్ రచించిన 'భారత దర్శనం' పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర నాయకులు హరినాథరెడ్డి విడుదల

చేశారు. ఆ తర్వాత 'ప్రకాశం జిల్లా సంస్కృతి-సాహిత్యం-కళారంగం' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ చర్చా సభకు ప్రముఖ సినీ నటులు, నిర్మాత, 'మా' ఉపాధ్యక్షులు మాదాల రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, సీపీఐ నాయకులు హరినాథరెడ్డి, జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఎ.వి.పుల్లారావు, చంద్ర నాయక్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సభలో చంద్ర నాయక్ ప్రకాశం జిల్లా కళల ప్రాముఖ్యతను వివరిస్తూ 'వందనం... వందనం...' అనే జానపద పాటను ఆలపించి ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. మాదాల రవి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా నుంచి మాదాల రంగారావు, జానీ లీవర్ వంటి గొప్ప నటులు, అలాగే కొరియోగ్రాఫర్లు, ఫైట్ మాస్టర్లు వంటి ఎందరో కళాకారులు సినీ రంగానికి అందించిన సేవలను వివరించారు.

నేటి కార్యక్రమాలు:

పుస్తక మహోత్సవం చివరి రోజు ఆదివారం అనేక కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు విద్యార్థుల కోసం క్విజ్ పోటీ ఉంటుంది. ఒక పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులతో కూడిన జట్టులు ఎన్నయినా పాల్గొనవచ్చు. సాయంత్రం 6 గంటలకు బి.హనుమారెడ్డి జీవితం-సాహిత్యంపై సభ ఉంటుంది. పుస్తక మహోత్సవం ముగింపు కార్యక్రమం సాయంత్రం 7 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులు వందేమాతరం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.